తెలంగాణ పేపర్

తెలుగు దినపత్రిక

వందేమాతరం బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

వందేమాతరం గేయానికి మరిన్ని రక్షణలు కల్పించే నేషనల్ ఆనర్ యాక్ట్-2026కు రాష్ట్రపతి ఆమోదం లభించింది. జాతీయ గేయాన్ని అవమానించడాన్ని నేరంగా గుర్తించేలా 1971 నాటి చట్టానికి కేంద్రం తాజాగా మార్పులు చేసిన విషయం తెలిసిందే. జాతీయ గీతం స్థాయిలో వందేమాతరం గేయానికి రక్షణ కల్పించేలా ఈ మార్పులు చేసింది. ఇటీవలే పార్లమెంటు ఆమోదించిన బిల్లుకు తాజాగా రాష్ట్రపతి ఆమోదం కూడా లభించింది. తాజాగా నిబంధనల ప్రకారం, జాతీయ గీతం లేదా గేయం ఆలాపనను అడ్డుకున్న వారికి గరిష్ఠంగా మూడేళ్ల జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశం ఉంది. ఈ పాటల ఆలాపన జరుగుతున్న సమయంలో అడ్డంకులు సృష్టించేవారికీ ఇవే శిక్షలు విధిస్తారు. అంతకుముందున్న చట్టంలోని సెక్షన్ 3 ప్రకారం, కేవలం జాతీయ గీతానికి ఈ రక్షణలు ఉండేవి. ప్రస్తుతం వందేమాతరం గేయానికీ ఇవే రక్షణలు కల్పిస్తూ చట్టంలో మార్పులు చేశారు.

హైదరాబాద్ సంపుటి: 13 సంచిక : 262 | సంపాదకులు : నస్రీన్ ఖాన్ | మంగళవారం, ఆగస్టు 11, 2026 | పేజీలు : 8 వెల : రూ. 2/-

ప్రతి ఇంటి పై జాతీయ జెండా ఎగరేయండి:

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపు



హైదరాబాద్ : హైదరాబాద్ లోని తన నివాసంలో జాతీయ జెండాను ఎగరేసిన కేంద్ర మంత్రిఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని దేశవ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' అభియాన్ కార్యక్రమాన్ని రాష్ట్రమంతా విజయవంతం చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపు ఇచ్చారు. అందులో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగిరేలా బిజెపి శ్రేణులు కృషి చేయాలని కోరారు.'హర్ ఘర్ తిరంగా అభియాన్' ప్రోగ్రాం పురస్కరించుకుని కేంద్ర మంత్రి బండి సంజయ్ హైదరాబాద్ లోని తన నివాసం వద్ద జాతీయ జెండాను ఎగరవేశారు. అనంతరం పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొనేందుకు ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు.దేశవ్యాప్తంగా 'హర్ ఘర్ తిరంగా' అభియాన్ ప్రోగ్రామ్‌లు నేటి నుండి హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమం ప్రారంభం కానున్న నేపథ్యంలో తిరంగా యాత్ర'లను విజయవంతంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు కోరారు.కుల, మత, వర్గాలకు అతీతంగా ప్రతి భారతీయుడు, విద్యార్థులు పెద్ద ఎత్తున భాగస్వామ్యమై స్వచ్ఛందంగా తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశంపై తమకున్న భక్తిభావాన్ని చాటుకోవడానికి ఇది సువర్ణావకాశమని పేర్కొన్నారు.

ట్రైబ్యునళ్ల సంస్కరణల బిల్లుకు లోక్‌సభ ఆమోదం

ట్రైబ్యునళ్ల నియామక ప్రక్రియను బలోపేతం చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ''ట్రైబ్యునళ్ల సంస్కరణల బిల్లు-2026''కు లోక్‌సభ ఆమోదం తెలిపింది. సోమవారం సభలో వివిధ అంశాలపై విపక్ష ఎంపీల నినాదాల మధ్య ఎలాంటి చర్చ లేకుండానే ఈ బిల్లు మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. ట్రైబ్యునళ్ల నియామకాల్లో పారదర్శకత, స్వతంత్రత, ఏకరూపతను తీసుకురావడంతో పాటు వాటి పనితీరులో సమర్థతను పెంచడమే ఈ బిల్లు ముఖ్య ఉద్దేశమని ప్రభుత్వం పేర్కొంది.



ఈ బిల్లు చట్టంగా మారితే దేశంలో "నేషనల్ ట్రైబ్యునల్స్ కమిషన్" ఏర్పాటవుతుంది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి లేదా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి నేతృత్వం వహించే ఈ కమిషన్‌లో ఛైర్‌పర్సన్‌తో పాటు ఇద్దరు న్యాయ, ఇద్దరు సాంకేతిక రంగ నిపుణులు సభ్యులుగా ఉంటారు. ఈ కొత్త చట్టం ద్వారా ట్రైబ్యునళ్ల నియామకాలు, అర్హతలు, పదవీకాలం, వేతనాలు, సభ్యుల తొలగింపు తదితర అంశాలపై స్పష్టమైన నిబంధనలు అమల్లోకి రానున్నాయి. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ బిల్లు తీసుకువచ్చినట్లు కేంద్రం వెల్లడించింది. కాగా, ఈ బిల్లు అమల్లోకి వస్తే ప్రస్తుతం ఉన్న 2021 నాటి ట్రైబ్యునళ్ల సంస్కరణల చట్టం రద్దవుతుంది.

విద్యార్థుల నిరసనలపై చర్చకు సిద్ధమే.. అమిత్ షా మాట్లాడతారు: కేంద్రం



నీట్ ప్రశ్నపత్రం లీకేజీ అంశంపై ఉద్యమించిన విద్యార్థులపై పోలీసుల అనుచిత తీరుపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా వివరణ ఇవ్వాలంటూ ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ విషయంపై పార్లమెంటు ఉభయ సభలను స్తంభింపజేస్తున్నాయి. ఈ క్రమంలో పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు కీలక ప్రకటన చేశారు. విద్యార్థుల నిరసనలు, పోలీసు చర్యలపై లోక్‌సభలో చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా దీనిపై సమాధానం ఇస్తారని ప్రకటించారు.

"విద్యార్థుల నిరసనలపై సమగ్ర చర్చతోపాటు ప్రతిపక్షాలు లేవనెత్తిన అన్ని అంశాలపై సమాధానం ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. కేంద్ర హోంమంత్రి దీనిపై స్పందిస్తారు. అయితే.. చర్చ జరుగుతున్న సమయంలో ప్రతిపక్షాలు ఎటువంటి అంతరాయం కలిగించవద్దు. హోం మంత్రి ప్రకటనకు ఆటంకం కలిగించేలా గందరగోళం సృష్టించకూడదు. హోంమంత్రి ఇచ్చే సమాధానాన్ని వినాలి. చర్చ సమగ్రంగా సాగేలా సహకరించాలి. ఈ మేరకు ప్రతిపక్షాలు హామీ ఇవ్వాలి" అని కిరణ్ రిజిజు మీడియాతో అన్నారు.

భద్రంగా ఉంటాయని రూ.5 లక్షలు భూమిలో దాచిపెడితే..!

జులై 20న ప్రారంభమైన పార్లమెంటు వర్షాకాల సమావేశాలు పదేపదే వాయిదా పడుతున్నాయి. ప్రతిపక్ష పార్టీలు తొలుత నీట్ పేపర్ లీక్‌పై, అయోధ్య రామ మందిరంలో విరాళాల అవకతవకలపై నిరసన తెలిపాయి. ఆ తర్వాత.. నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంలో నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసుల చర్యపై చర్చకు పట్టుబడుతూ ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నాయి. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి సభకు హాజరు కావాలని, ఈ అంశాలపై ప్రకటనలు చేయాలని డిమాండ్ చేస్తున్నాయి.

ఇంటింటా జాతీయ జెండాను ఎగరేయండి: మోదీ



దిల్లీ: మన జాతీయ పతాకం దేశానికి గర్వకారణమని, 'హర్ ఘర్ తిరంగా' (ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం) కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పాల్గొనాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. త్రివర్ణ పతాకం మనకు నిరంతర ప్రేరణ శక్తి అని పేర్కొన్నారు. ఏటా స్వాతంత్ర్య దినోత్సవం నాడు కోట్ల మంది ప్రజలు తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని 2022 నుంచి ప్రభుత్వం 'హర్ ఘర్ తిరంగా' నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈసారీ జాతీయ జెండాను ఎగురవేసి.. వికసిత భారత్‌కు మన ఉమ్మడి కట్టుబాటును చాటుదామని మోదీ కోరారు.

క్విట్ ఇండియా ఉద్యమకర్తలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తి

క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నవారు కనబరిచిన ధైర్యసాహసాలు భారతీయుల్లో ప్రతి ఒక్కరికీ ఎప్పటికీ గుర్తుండిపోతాయని మోదీ కొనియాడారు. 1942 ఆగస్టు 9న మహాత్మా గాంధీ నేతృత్వంలో మొదలైన ఉద్యమం మన దేశ స్వాతంత్ర్య పోరాటానికి నిర్ణయాత్మక ప్రేరణను ఇచ్చిందని గుర్తు చేసుకున్నారు.

వందేమాతర గీతాన్ని పూర్తిగా పాడబోం: కేరళ

కాసర్‌గోడ్: తమ రాష్ట్రంలో వందేమాతర గీతాన్ని పూర్తిగా పాడబోమని కేరళ ఆరోగ్యశాఖ మంత్రి కె.మురళీధరన్, కాంగ్రెస్ ఎంపీ రాజ్‌మోహన్ ఉన్నిథాన్ స్పష్టం చేశారు. గతంలో మాదిరిగానే గీతంలోని మొదటి రెండు చరణాలనే పాడతామని తెలిపారు.


అమిత్ షా సమాధానం చెప్పాల్సిందే: రాహుల్



దిల్లీ: ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు జరిపిన దాడిపై ఎందుకు మౌనంగా ఉంటున్నారంటూ కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ప్రశ్నించారు. ఈ 'నేరం'పై ఆయన సమాధానం చెప్పాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రయాగ్‌రాజ్‌లో శనివారం జరిగిన 'ఛాత్రోంకీ గూంజ్' (విద్యార్థుల ప్రతిధ్వని) కార్యక్రమంలో ఓ విద్యార్థి నీట్‌కు సన్నద్ధమైన తాను సర్వం కోల్పోయానని, తనకు ఏ అవకాశాలు మిగల్లేదని ఆవేదనతో తెలిపాడని రాహుల్ వెల్లడించారు. దిల్లీలోని జంతర్ మంతర్‌వద్ద విద్యార్థుల ఆందోళన ముగిసి చాలా రోజులవుతున్నప్పటికీ ఇప్పటి వరకూ వారిపై పోలీసుల దాడికి సంబంధించి అమిత్ షా నోటి నుంచి ఒక్క మాట కూడా పెగల్లేదని రాహుల్ విమర్శించారు. మరోవైపు విద్యార్థులకు క్షమాపణ చెప్పడానికి బదులు వారిని క్షమిస్తున్నానంటూ ప్రధాని మోదీ తీరిక లేకుండా ఉన్నారని ఆక్షేపించారు.

తక్షణమే కాళేశ్వరం మోటార్లు ఆన్ చేయండి:

మంత్రి ఉత్తంకుమార్ రెడ్డికి..మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు లేఖ



సిద్దిపేట : రైతుల ప్రయోజనాల దృష్ట్యా రాజకీయలకు అతీతంగా వెంటనే నీటి పంపింగ్ చేయండి వెంటనే కాళేశ్వరం మోటార్లు ఆన్ చేసి రిజర్వాయర్లు నింపాలంటూ ఉత్తం కుమార్ రెడ్డికి మాజీ మంత్రి హరీష్ రావు లేఖ.రిజర్వాయర్ లలో నీటిని సకాలం లో నింపక పోవడం వల్ల పంటల సాగు ముందుకు పోక రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని పేర్కొన్న హరీష్ రావు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలో వివిధ జిల్లాలోని రిజర్వాయర్లు అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండ పోచమ్మ సాగర్, బస్వాపూర్ రిజర్వాయర్ లను నింపి సుమారు 4లక్షల ఎకరాల ఆయకట్టు పరిధిలోని రైతుల ప్రయోజనాల దృష్ట్యా కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మిడ్ మానేరు నుండి మోటార్లను ఆన్ చేసి నీటి పంపింగ్ చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి విజ్ఞప్తి.ఒక వైపు ఎలినినో వల్ల తక్కువ వర్షభావం, మరో వైపు ప్రాజెక్టు ల్లో నీళ్లు లేక ఆందోళన లో అన్నదాతలు.వానాకాలం పంట సాగు కు సాగు నీరు కోసం ఎదురు చూస్తున్న రైతాంగంఏ మాత్రం ఆలస్యం చేయకుండా రిజర్వాయర్ లకు నీటిని పంపింగ్ చేయాలని రైతుల పక్షాన లేఖ ద్వారా డిమాండ్ చేసిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలో వివిధ జిల్లాలోని రిజర్వాయర్ లు అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండ పోచమ్మ సాగర్, నృసింహ బస్వాపూర్ రిజర్వాయర్ లను నింపి సుమారు 4లక్షల ఎకరాల ఆయకట్టు పరిధిలోని రైతుల ప్రయోజనాల దృష్ట్యా కాళేశ్వరం ప్రాజెక్టు లో భాగంగా మోటార్లను ఆన్ చేసి వెంటనే నీటి పంపింగ్ చేయాలని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కి మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు రైతుల పక్షాన లేఖ..ప్రస్తుత వానాకాలం పంట సీజన్ రైతులు ఇటు ఎలినినో వల్ల తక్కువ వర్షాభావం, అటు ప్రాజెక్టుల్లో రిజర్వాయర్ లలో నీటిని సకాలం లో నింపక పోవడం తద్వారా పంటల సాగు ముందుకు సాగక రైతులు తీవ్ర ఆందోళన లో ఉన్న విషయం లేఖలో పేర్కొన్నారు.. ఇటీవల ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల వలన వచ్చే వరదను తద్వారా ప్రతి నీటి చుక్కని ఒడిసి పట్టి సకాలంలో కాళేశ్వరం ప్రాజెక్టు పంప్ లను ఆన్ చేసి రైతుల ప్రయోజనాల దృష్ట్యా నీటి పంపింగ్ ప్రారంభించాలని రైతుల పక్షాన డిమాండ్ హరీష్ రావు లేఖ ద్వారా డిమాండ్ చేశారు.కాళేశ్వరం ప్రాజెక్టు లో అంతర్భాగం అయిన మిడ్ మానేరు రిజర్వాయర్ పూర్తి నీటి సామర్థ్యం 27 టిఎంసి లు, ప్రస్తుతం సుమారు 22 టిఎంసి ల నీటి లభ్యత ఉందని అదేరకంగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల వలన గోదావరి లోని వరద నీటి లభ్యత కూడా ఏర్పడనుందన్నారు. ఇట్టి విషయం దృష్టిలో ఉంచుకొని మిడ్ మానేరు నుండి మోటార్లను ఆన్ చేసి నీటి పంపింగ్ ప్రారంభించాలని, తద్వారా కాళేశ్వరం ప్రాజెక్టు లో అంతర్భాగమైన అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్,కొండపోచమ్మ సాగర్, నృసింహ బస్వాపూర్ తదితర రిజర్వాయర్ లను, వాటి పరిధిలోని చెరువులను, చెక్ డ్యామ్ ల అన్నింటిని నింపి సుమారు 4లక్షల ఎకరాల కు నీరందించేలా చర్యలు చేపట్టలన్నార రైతు సాగు ప్రయోజనాలు తీర్చడానికి ఏ మాత్రం ఆలస్యం చేయకుండా నీటి పంపింగ్ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నానని లేఖ ద్వారా చెప్పారు.అదేవిదంగా లోయర్ మానేరు డ్యామ్ ఎల్ఎండి పూర్తి నీటి సామర్థ్యం 24 టిఎం సి లు, ప్రస్తుత నీటి లభ్యత 6.9 టి ఎంసిలు ఉన్నాయి. మిడ్ మానేరు నుండి లోయర్ మానేరు ఎల్ఎండి కు నీటిని నింపి నీరు అందించి రైతులను అదుకోవాలని విజ్ఞప్తి చేశారు.. గత యాసంగి పంట లో కాళేశ్వరం ప్రాజెక్టు లోని పై రిజర్వాయర్ల ఆయకట్టు పరిధిలో 4లక్షల ఎకరాలు సాగు అయిన విషయం గుర్తించి ఈ వానాకాలం పంటకి అదేవిదంగా వచ్చే యాసంగి పంటకు కూడ సాగు నీరు అందించేల కాళేశ్వరం ప్రాజెక్టు అంతర్భాగంలోని అన్ని రిజర్వాయర్ నింపి తద్వారా వాటి అనుసంధానం గా నిర్మించిన కాలువ లు, చెరువు లు చెక్ డ్యామ్ ల అన్నింటిని నింపి రైతుల్లో నెలకొన్న ఆందోళనను తొలగించి రైతు ప్రయోజనాల. దృష్ట్యా రాజకీయలకు అతీతంగా వెంటనే నీటి పంపింగ్ ప్రారంభించేల చర్యలు చేపట్టాలని లేఖలో కోరారు.

హర్ ఘర్ తిరంగా'తో ప్రతి ఇంటా దేశభక్తి చాటాలి

బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రానీచందర్ రావు పిలుపు

తన ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసిన . రానీచందర్ రావు

ఆగస్టు 14న ట్యాంక్ బండ్ దగ్గర భారీ 'తిరంగా యాత్ర'

పార్టీలకతీతంగా ప్రజలందరూ పాల్గొనాలని విజ్ఞప్తిప్రధాని

నరేంద్ర మోదీ పిలుపు మేరకు చేపట్టిన 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రానీచందర్ రావు కోరారు.రాబోయే ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని, దేశం కోసం ప్రాణాలర్పించిన స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అందులో భాగంగానే ఈరోజు 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో పాల్గొని, తన ఊరిలో, తన గల్లీలోని యువతతో కలిసి ఆయన తన ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసినట్లు తెలిపారు. ప్రజలందరూ స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ఇళ్లపై జెండాలు ఎగురవేయాలని కోరారు.అలాగే ఆగస్టు 14న హైదరాబాద్ ట్యాంక్ బండ్ దగ్గర చాలా పెద్ద ఎత్తున 'తిరంగా యాత్ర' నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఈ యాత్ర ఏ ఒక్క పార్టీకో, రాజకీయాలకో సంబంధించింది కాదని... మన భారతదేశ ఐక్యతను, శక్తిని ప్రపంచానికి చాటిచెప్పడానికి, 'వికసిత భారత్' సంకల్పంతో చేపడుతున్న యాత్ర అని చెప్పారు. కాబట్టి హైదరాబాద్ ప్రజలందరూ కుల, మత, రాజకీయ విభేదాలను పక్కనబెట్టి, దేశం కోసం ఈ తిరంగా యాత్రలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎన్. రానీచందర్ రావు పిలుపునిచ్చారు

తెలంగాణ పవర్

సంపాదకీయం

మంగళవారం, ఆగస్టు 11, 2026

ఎఫ్ సీఆర్ ఏ సవరణ బిల్లులో బిగ్ ట్విస్ట్.

భారతదేశంలో చట్టాలు రూపొందించడం, వాటిపై చర్చించడం పార్లమెంటు, రాజకీయ పార్టీల నేతల వరిధిలోనిదే. అభ్యంతరాలు ఉంటే అవి సభల్లోనే వ్యక్తం కావాలి. దీనికి విరుద్ధంగా విదేశీ నేతలు స్పందించడం అంతర్గత వ్యవహారాల్లో జోక్యంగా పరిగణించబడుతుంది. ఇటీవల ఎఫ్‌సీఆర్‌ఏ సంబంధిత బిల్లు విషయంలో ఇదే సూత్రాన్ని భారత్ స్పష్టం చేసింది.ఈ బిల్లు విదేశీ నిధుల రాకపోకలపై నియంత్రణను మరింత కఠినం చేసే దిశగా ఉంది. సంస్థలు నిధుల మూలాలు, ఖర్చుల వివరాలు స్పష్టంగా నివేదించాల్సి ఉంటుంది. లేనిపక్షంలో ఆస్తులు జప్తు చేసే అధికారం కేంద్రానికి ఉంటుంది. దీని ద్వారా అంతర్గత భద్రతకు ముప్పు కలిగించే శక్తులపై నియంత్రణ సాధ్యమవుతుందని ప్రభుత్వ వైపు నుంచి వాదన ఉంది. రాజకీయ చర్చలు ఈ అంశం చుట్టూనే తిరగనున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా ఈ బిల్లు ఆమోదంపై దృఢంగా ఉన్నారని సూచనలు వస్తున్నాయిఈ ప్రక్రియపై అమెరికా సెనేటర్ రైలీ మూర్ వ్యతిరేకత వ్యక్తం చేశారు. భారత్‌లో క్రైస్తవులు సెయింట్ థామస్ కాలం నుంచి ఉన్నారని, వేల సంవత్సరాల చరిత్ర ఉందని చెబుతూ, ఎఫ్‌సీఆర్‌ఏ ద్వారా వారిని నియంత్రించాలని ప్రయత్నం జరుగుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇలాంటి వ్యాఖ్యలు మత విద్వేషాలను రెచ్చగొట్టే ప్రయత్నంగా కనిపించాయి. అయితే అమెరికాలోనే అమలులో ఉన్న ఇలాంటి నియంత్రణల గురించి ఆయన ప్రస్తావించలేదు. భారత్ నుంచి అమెరికాలోని ఇస్కాన్ వంటి సంస్థలకు నిధులు వెళ్తే అవి అమెరికా నిబంధనలకు లోబడి లెక్కలు చూపాల్సి ఉంటుంది. ఇదే తరహా జవాబుదారీతనం భారత్‌లోనూ అమలు చేయాలనే ఉద్దేశంతో ఈ బిల్లు వస్తోంది.విదేశీ వ్యాఖ్యలపై విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ స్పందించారు. ఇది పూర్తిగా భారత అంతర్గత వ్యవహారమని, బయటివారు స్పందించాల్సిన అవసరం లేదని తెలిపారు. ఇలాంటి స్పష్టత అమెరికాకు అసౌకర్యం కలిగించవచ్చు. యూరప్ నేతలు కూడా ఇలాంటి సందర్భాల్లో సాధారణంగా జాగ్రత్తగా ఉంటారు. అయినా భారత్ తన సార్వభౌమత్వాన్ని నొక్కి చెప్పింది. రైలీ మూర్ ట్రంప్‌కు సన్నిహితుడని, ఆయన ద్వారా సందేశం వస్తున్నట్లు కొందరు అంచనా వేస్తున్నా, అధికారికంగా ఇది ఒక సెనేటర్ వ్యక్తిగత అభిప్రాయంగానే చూడాలి.ప్రతి దేశం తన భద్రత, నిధుల పారదర్శకత కోసం చట్టాలు తీసుకురావడం సహజం. వివాదాస్పద విదేశీ విరాళాల (నియంత్రణ) సవరణ బిల్లు?2026పై కేంద్ర ప్రభుత్వం కీలక స్పష్టత ఇచ్చింది. ఈ బిల్లును గత కాలానికి (రెట్రోస్పెక్టివ్‌గా) వర్తింపజేయబోమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా హామీ ఇచ్చినట్లు మిజోరం ముఖ్యమంత్రి లాల్దుహోమా వెల్లడించారు. మిజోరం చర్చి నాయకుల ప్రతినిధి బృందంతో కలిసి అమిత్ షాను కలిసిన అనంతరం ఆయన ఈ విషయాన్ని మీడియాకు తెలిపారు. ఈ బిల్లును ఆగస్టు 12న పార్లమెంట్‌లో చర్చించి ఆమోదానికి తీసుకురానున్నట్లు హోంమంత్రి వెల్లడించినట్లు చెప్పారు.ప్రతిపాదిత ఎఫ్‌సీఆర్‌ఏ సవరణ బిల్లు విదేశీ నిధులు స్వీకరించే స్వచ్ఛంద సంస్థలపై పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ముఖ్యంగా ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ రద్దు అయిన, గడువు ముగిసిన లేదా స్వచ్ఛందంగా వదులుకున్న సంస్థలకు చెందిన విదేశీ నిధులు, వాటితో కొనుగోలు చేసిన ఆస్తులను ప్రభుత్వం నియమించే ప్రత్యేక అధికార సంస్థ ఆధీనంలోకి తీసుకునే విధంగా కొత్త నిబంధనలు తీసుకురావాలని బిల్లు ప్రతిపాదిస్తోంది.అయితే ఈ చట్టాన్ని గతానికి వర్తింపజేస్తే నిజాయితీగా పనిచేస్తున్న సంస్థలు కూడా ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని మిజోరం ముఖ్యమంత్రి లాల్దుహోమా, మిజోరం కోహ్రాన్ హ్రూయితు కమిటీ, మిజోరం చర్చిల మండలి ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో జరిగిన పరిపాలనా లేదా సాంకేతిక లోపాల కారణంగా స్వచ్ఛంద సంస్థలు శిక్షార్హులుగా మారే అవకాశం ఉందని పేర్కొంటూ, ఈ చట్టాన్ని భావి కాలానికి మాత్రమే వర్తింపజేయాలని కేంద్రాన్ని కోరారు. దీనిపై స్పందించిన అమిత్ షా, బిల్లు గతానికి వర్తించదని హామీ ఇచ్చినట్లు లాల్దుహోమా తెలిపారు.ఇదే సమయంలో పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో కొనసాగుతున్న ప్రతిష్టంభనను తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలను వేగవంతం చేసింది. కీలకమైన మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్ బిల్లుతో పాటు ఇతర చట్టాలపై చర్చ జరిగేలా ప్రతిపక్షాలతో సంప్రదింపులు కొనసాగిస్తోంది. ఈ క్రమంలో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో ఫోన్‌లో మాట్లాడి సహకారం కోరారు. గత పది రోజుల్లో పలుమార్లు ఇరు నేతల మధ్య చర్చలు జరిగినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.కాంగ్రెస్ మాత్రం కీలక బిల్లులపై ముందుగా అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేస్తోంది. అయితే దీనిపై కేంద్రం ఇప్పటివరకు స్పష్టమైన హామీ ఇవ్వలేదు. మరోవైపు 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందే మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేసే దిశగా రాజ్యాంగ సవరణ బిల్లుపై ప్రభుత్వం ఏకాభిప్రాయం సాధించే ప్రయత్నాలు చేస్తోంది. అలాగే 2011 జనాభా లెక్కల ఆధారంగా లోక్‌సభ స్థానాలను 543 నుంచి 816కు పెంచే డీలిమిటేషన్ ప్రతిపాదనపైనా రాజకీయ పార్టీలతో చర్చలు కొనసాగుతున్నాయి. ఈ కీలక బిల్లులపై ఆగస్టు 12న జరిగే పార్లమెంట్ చర్చ దేశ రాజకీయాల్లో కీలక మలుపు తిప్పే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.అమెరికా తన భూభాగంలో విదేశీ నిధులపై నియంత్రణలు పెట్టుకుంటే, భారత్‌లోనూ అదే హక్కు ఉంది. ఒకవైపు స్వేచ్ఛ, మత స్వాతంత్ర్యం గురించి మాట్లాడుతూ, మరోవైపు మరొక దేశం యొక్క నియంత్రణ చర్యలను లక్ష్యంగా చేసుకోవడం ద్వంద్వ ప్రమాణాలను సూచిస్తుంది. ఎఫ్‌సీఆర్‌ఏ కేవలం ఒక మతాన్ని లక్ష్యం చేసుకోవడం కాదు.. అన్ని సంస్థలకు వర్తించే సాధారణ నిబంధనలు. అంతర్గత శత్రువులు లేదా అపారదర్శక నిధుల మార్గాలను అడ్డుకోవడమే దీని ముఖ్య ఉద్దేశం.మొత్తంగా చూస్తే, ఈ వివాదం భారత్ తన స్వాతంత్ర్యాన్ని, చట్టపరమైన సార్వభౌమత్వాన్ని ఎలా కాపాడుకుంటుందో చూపిస్తోంది.

- ఎడిటర్

“ఇన్‌టెక్స్” బహుళ విభాగాల విస్తరణతో హోమ్ అప్లయన్సెస్ పోర్ట్‌ఫోలియో బలోపేతం

26లో ఆర్థిక సంవత్సరంలో కన్స్యూమర్ డ్యూరబుల్స్ వ్యాపారంలో 80% వార్షిక వృద్ధిని నమోదు
విశాఖపట్నం , 10 ఆగస్టు, 2026: భారతదేశంలోని ప్రముఖ స్వదేశీ కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ బ్రాండ్లలో ఒకటైన ఇన్‌టెక్స్ టెక్నాలజీస్, భారతదేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న కన్స్యూమర్ డ్యూరబుల్స్ మార్కెట్లో తన ఉనికిని మరింత బలోపేతం చేసుకునే విస్తృత వ్యూహంలో హోమ్ అప్లయన్సెస్ పోర్ట్‌ఫోలియోను విస్తరిస్తున్నట్లు ఇన్‌టెక్స్ టెక్నాలజీస్ డైరెక్టర్ కేశవ్ బన్సల్ మాట్లాడుతూ “మా కన్స్యూమర్ డ్యూరబుల్స్ వ్యాపారంలో నమోదైన బలమైన వృద్ధి, ఇన్‌టెక్స్ బ్రాండ్‌పై వినియోగదారుల్లో పెరుగుతున్న నమ్మకానికి నిదర్శనం. వినియోగదారుల ఆకాంక్షలు మారుతున్న నేపథ్యంలో, నాణ్యత, విశ్వసనీయత అందుబాటు ధరల్లో విలువను అందించే మరింత సమగ్రమైన హోమ్ అప్లయన్సెస్ పోర్ట్‌ఫోలియోను నిర్మించేందుకు స్పష్టమైన అవకాశాన్ని మేము చూస్తున్నాము. ఫ్యాన్లు, వాటర్ హీటర్లు స్మాల్ డొమెస్టిక్ అప్లయన్సెస్ విభాగాల్లోకి మా విస్తరణ మార్కెట్లో మా స్థానాన్ని మరింత



బలోపేతం చేస్తుందని మేము విశ్వసిస్తున్నామని అన్నారు.

ఎయిర్ కూలర్ల విభాగంలో ఇప్పటికే స్థిరమైన ఉనికిని కలిగి ఉన్న ఇన్‌టెక్స్, ఇప్పుడు డెకరేటివ్, ఎనర్జీ-ఎఫిషియెంట్ బి ఎల్ డి సి ఎగ్జాస్ట్ టేబుల్, మోడళ్లతో కూడిన సమగ్ర ఫ్యాన్ శ్రేణిని అందుబాటులోకి తీసుకువస్తోంది. కుటుంబ అవసరాలకు అనుగుణంగా భిన్న సామర్థ్యాల్లో స్టోరేజ్ ఇన్‌స్టంట్ గీజర్లతో వాటర్ హీటర్ విభాగంలోకి కూడా ఇన్‌టెక్స్ ప్రవేశిస్తోందని అన్నారు. ఇందులో ఐరన్లు, మిక్సర్ గ్రైండర్లు, జ్యూసర్ మిక్సర్ గ్రైండర్లు, ఎయిర్ ఫ్రయ్యర్లు, ఎలక్ట్రిక్ కెటిల్స్ కుక్‌టాప్‌లు వంటి ఉత్పత్తులు ఉన్నాయి.

ఈ వ్యాపారం 80% ఆర్థిక సంవత్సరానికి వృద్ధిని నమోదు చేసింది. స్మార్ట్ టీవీలు, ఎయిర్ కండిషనర్లు వాషింగ్ మెషీన్లకు పెరిగిన డిమాండ్ ఈ వృద్ధికి ప్రధాన కారణంగా నిలిచింది.

మార్కెట్లలో డిమాండ్ వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో తన డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ యర్-×× టియర్-××× , బలమైన రిటైల్ భాగస్వామ్యాలు సమర్థవంతమైన ఆఫ్టర్-సేల్స్ సర్వీస్ సామర్థ్యాలను వినియోగించుకోవడం ద్వారా తన మార్కెట్ ఉనికిని మరింత విస్తరించేందుకు ఇన్‌టెక్స్‌కు గణనీయమైన అవకాశం ఉందని కంపెనీ భావిస్తోం

గిఫ్ట్ సిటీ ద్వారా ఎన్ ఆర్ ఐ కు యు ఎస్ డాలర్లలో టర్మ్ ఇన్సూరెన్స్ ప్లాన్లను అందిస్తున్న పాలసీ బజార్

భారతదేశ గ్లోబల్ ఫైనాన్షియల్ ఎకోసిస్టమ్‌లో గిఫ్ట్ సిటీ తన పరిధిని విస్తరిస్తున్న నేపథ్యంలో, పాలసీ బజార్ తన భాగస్వామ్య బీమా సంస్థల యు ఎస్ డాలర్ ఆధారిత టర్మ్ ఇన్సూరెన్స్ ప్లాన్లను ఎన్ ఆర్ ఐలకు అందించడం ప్రారంభించింది. భారతదేశంలోని ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్ ద్వారా ఈ సేవలను అందిస్తోంది. భారతదేశం నుంచి అందించే సరిహద్దులు దాటి ఆర్థిక పరిష్కారాల పరిణామంలో ఇది ఒక ముఖ్యమైన ముందడుగు. ఈ కొత్త సేవ ద్వారా ఎన్ ఆర్ ఐలకు యు ఎస్ డాలర్లలో ప్రీమియంలను చెల్లించడంతో పాటు, క్లెయిమ్ మొత్తాన్ని కూడా అదే కరెన్సీలో పొందవచ్చు. విదేశాల్లో నివసిస్తున్న భారతీయులు ఎదుర్కొనే, అయితే పెద్దగా చర్చకు రాని ఆర్థిక ప్రమాదాల్లో ఒకటైన కరెన్సీ విలువ తగ్గుదల సమస్యకు ఇది పరిష్కారాన్ని అందిస్తుంది.

భారతీయ ప్రవాస సమాజానికి గ్లోబల్ ఫైనాన్షియల్ ప్రొడక్ట్స్‌ను మరింత చేరువ చేయడంలో గిఫ్ట్ సిటీ పోషిస్తున్న పెరుగుతున్న పాత్రను ఈ కొత్త సేవ ప్రతిబింబిస్తోంది. గత కొన్ని సంవత్సరాలుగా ఐ ఎఫ్ ఎస్ సి ద్వారా విదేశీ ఫైనాన్షియల్ సెంటర్లలో మాత్రమే అందుబాటులో ఉండే అనేక బ్యాంకింగ్, పెట్టుబడి, బీమా పరిష్కారాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ కొత్త సేవతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయులు ఇకపై భారతదేశ నియంత్రణ వ్యవస్థ పరిధిలోనే అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రూపొందించిన ఆర్థిక ఉత్పత్తులను పొందవచ్చు.

కరెన్సీ విలువ తగ్గుదల నుంచి రక్షణ

చాలా మంది ఎన్ ఆర్ ఐ ఆర్థిక బాధ్యతలు రెండు దేశాలకు విస్తరించి ఉంటాయి. ఆదాయం ఖూ డాలర్లలో వస్తుండగా, విదేశాల్లో గృహ రుణాలు, పిల్లల విద్య, భారత్‌లో తల్లిదండ్రులు మరియు కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం వంటి బాధ్యతలు ఉంటాయి. అయితే ఇప్పటివరకు భారత్ నుంచి తీసుకున్న చాలా లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీలు భారతీయ రూపాయల్లోనే ఉండేవి. దీంతో ఒక ముఖ్యమైన, తరచుగా నిర్లక్ష్యం చేయబడే ఆర్థిక ప్రమాదం ఏర్పడుతోంది.

గత మూడు దశాబ్దాల్లో భారత రూపాయి విలువ యు ఎస్ డాలరుతో పోలిస్తే సంవత్సరానికి సగటున దాదాపు 3 శాతం చొప్పున తగ్గింది. ఇది సాధారణ ఆర్థిక పరిణామమే అయినప్పటికీ, కాలక్రమేణా రూపాయల్లో ఉన్న బీమా క్లెయిమ్ మొత్తానికి అంతర్జాతీయ కొనుగోలు శక్తిని గణనీయంగా తగ్గిస్తుంది.

దీనిని అర్థం చేసుకోవడానికి ఒక ఉదాహరణగా, 1996లో ఒక ఖూ డాలర్ విలువ సుమారు రూ. 35గా ఉన్న సమయంలో రూ. 2 కోట్ల లైఫ్ ఇన్సూరెన్స్ కవర్ విలువ దాదాపు యు ఎస్ డి 5,50,000గా ఉండేది. ప్రస్తుతం ఉన్న మారకపు రేట్ల ప్రకారం అదే రూ. 2 కోట్ల కవర్ విలువ సుమారు యు ఎస్ డి 2,00,000 మాత్రమే. విదేశాల్లో ఆర్థిక బాధ్యతలు ఉన్న కుటుంబాలకు ఇది గణనీయమైన రక్షణ లోటును కలిగించవచ్చు. కొత్తగా అందుబాటులోకి వచ్చిన డాలర్ ఆధారిత టర్మ్ ఇన్సూరెన్స్, ఎన్ ఆర్ ఐలకు సంపాదించే కరెన్సీతో పాటు వారి దీర్ఘకాలిక ఆర్థిక బాధ్యతలకు అనుగుణంగా బీమా కవరేజీని అందించడం ద్వారా ఈ వ్యత్యాసాన్ని తొలగించేందుకు ప్రయత్నిస్తోంది.

కరెన్సీ మార్పిడి సమస్యలను సులభతరం చేయడం

కరెన్సీ మార్పుల్లో వచ్చే హెచ్చుతగ్గుల నుంచి రక్షణ కల్పించడంతో పాటు, విదేశాల్లో నివసించే కుటుంబాలకు క్లెయిమ్ చెల్లింపులను మరింత ప్రయోజనకరంగా మార్చడంలో ఈ ఉత్పత్తి సహాయపడుతుంది. బీమా ప్రయోజనాలు ఖూ డాలర్లలో చెల్లించబడటంతో, క్లెయిమ్ సమయంలో మారకపు రేట్లలో వచ్చే మార్పుల గురించి లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం ఉండదు. విదేశాల్లోని దీర్ఘకాలిక ఆర్థిక బాధ్యతలను నిర్వహించేటప్పుడు ఇది మరింత భరోసాను అందిస్తుంది.

ఈ పాలసీ కొనుగోలు ప్రక్రియను కూడా డిజిటల్-ఫస్ట్ విధానంలో రూపొందించారు. అర్హత కలిగిన కస్టమర్లు ఆన్‌బోర్డింగ్ మరియు మెడికల్ అండర్‌రైటింగ్ ప్రక్రియలను రిమోట్‌గా పూర్తి చేసుకునే అవకాశం ఉంది. దీంతో ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న ఎన్ ఆర్ ఐలకు భారత్ నుంచి బీమా రక్షణ పొందడం మరింత సులభతరం అవుతుంది.

ఈ కొత్త సేవపై స్పందిస్తూ పాలసీ బజార్లో లైఫ్ ఇన్సూరెన్స్ విభాగం చీఫ్ బిజినెస్ ఆఫీసర్ వివేక్ జైన్ మాట్లాడుతూ, “గ్లోబల్ ఇండియన్స్ కోసం కొత్త తరం ఆర్థిక ఉత్పత్తులకు గిఫ్ట్ సిటీ పునాది వేసింది. పాలసీ బజార్లో మా పాత్ర ఏమిటంటే, ఈ అవకాశాలు కేవలం ఎకోసిస్టమ్‌కు మాత్రమే పరిమితం కాకుండా, కస్టమర్లకు సులభమైన మరియు అందుబాటులో ఉండే విధంగా చేరేలా చూడటం. ప్రపంచ స్థాయి ఆర్థిక పరిష్కారాలను ఎన్ ఆర్ ఐలకు మారుతున్న అవసరాలకు అనుసంధానించే వారధిగా మమ్మల్ని మేము భావిస్తున్నాం. వారు ఎక్కడ నివసిస్తున్నారు, ఎక్కడ సంపాదిస్తున్నారు, భవిష్యత్తు కోసం ఎలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు అనే అంశాలకు అనుగుణంగా ఉన్న ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురావడమే మా లక్ష్యం” అని అన్నారు.

గిఫ్ట్ సిటీ సరిహద్దులు దాటి అందించే ఆర్థిక సేవల అవకాశాలను మరింత విస్తరిస్తున్న నేపథ్యంలో, సరళమైన డిజిటల్-ఫస్ట్ ప్లాట్‌ఫామ్ ద్వారా ఎన్ ఆర్ ఐలకు ఈ అవకాశాలను మరింత సులభంగా అందుబాటులోకి తీసుకురావాలని పాలసీ బజార్ లక్ష్యంగా పెట్టుకుంది.

ముఖ్యమంత్రితో కలిసి వరుణ యాగం లో పాల్గొన్న ఎమ్మెల్యే కుంభం

వలిగొండ ఆగస్ట 10 తెలంగాణ పవర్ ప్రతినిధి: రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసి, మన ప్రాజెక్టులన్నీ జలకళతో కళకళలాడాలని ఆకాంక్షిస్తూ నాగార్జునసాగర్లోని కృష్ణా నది ఒడ్డున ప్రభుత్వం అత్యంత భక్తిశ్రద్ధలతో సోమవారం నిర్వహించిన ‘మహా వరుణ యాగం’లో ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి తో భువనగిరి శాసనసభ్యులు కుమార్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యాదగిరిగుట్ట వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య జరిగిన ఈ పవిత్ర క్రతువులో.. కృష్ణా,



గోదావరి నదులు నిండుగా ప్రవహించి, రైతుల ముఖాల్లో చిరునవ్వులు చూడాలని ఆ వరుణ దేవుణ్ణి మనస్ఫూర్తిగా ప్రార్థించాం. ఒకవైపు శాస్త్రీయ ప్రణాళికలతో ప్రభుత్వం ముందుకు వెళ్తూనే.. సకల జనుల సుఖసంతోషాల కోసం మన పూర్వీకుల ఆధ్యాత్మిక సంప్రదాయాలను గౌరవిస్తూ ఈ యాగం నిర్వహించాం. ప్రకృతి అనుగ్రహంతో తెలంగాణ రాష్ట్రం సస్యశ్యామలంగా, సుభిక్షంగా వర్ధిల్లాలని కోరుకున్నామని ఆయన తెలిపారు.

నృత్యతి – నృత్యతి”తో అలరించిన కూచిపూడి నాట్య ప్రదర్శన

భారత్ వికాస్ పరిషత్ వేదికగా “నృత్యతి – – నృత్యతి” అనే శీర్షికతో నిర్వహించిన కూచిపూడి నాట్య ప్రదర్శన ఘనంగా జరిగింది. ప్రముఖ అతిథిగా డా. ఎస్. పి. భారతి గారు హాజరై కళాకారులను అభినందించారు.

ప్రముఖ నృత్య గురువు నందిత రాజనాల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కూచిపూడి నాట్యంలోని సాంప్రదాయ నృత్త, నృత్య, అభినయ అంశాలను కళాకారులు అద్భుతంగా ఆవిష్కరించారు. లైవ్ ఆర్కెస్ట్రా సహకారంతో సంగీతం, గానం, మృదంగం, నట్టువాంగం, వయోలిన్ సమన్వయమై ప్రదర్శనకు మరింత జీవం పోశాయి. ప్రత్యక్ష సంగీతానికి అనుగుణంగా కళాకారుల నృత్య కదలికలు, జతులు, అభినయాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

నట్టువాంగం నందిత రాజనాల నిర్వహిస్తూ, లయ--తాళాలను నృత్యంతో అద్భుతంగా సమన్వయం చేశారు. నట్టువాంగం, నృత్యం కలయికతో కూచిపూడి సంప్రదాయ నాట్య వైభవం వేదికపై సాక్షాత్కరించినట్లుగా అనిపించింది.



ఈ సందర్భంగా డా. ఎస్. పి. భారతి గారు మాట్లాడుతూ, “కూచిపూడి మన తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక. ఇలాంటి శాస్త్రీయ కళలను భావితరాలకు అందించడం ఎంతో అభినందనీయం. ‘నృత్యతి -- నృత్యతి’ వంటి కార్యక్రమాలు మన సంప్రదాయ కళలకు మరింత ప్రాచుర్యం కల్పిస్తాయి. నృత్య గురువు నందిత రాజనాల చేస్తున్న కృషి ప్రశంసనీయం” అని అన్నారు.

కూచిపూడి సంప్రదాయాన్ని కాపాడుతూ, ఆధునిక తరానికి చేరువ చేసే విధంగా లైవ్ ఆర్కెస్ట్రాతో నిర్వహించిన ఈ నాట్య ప్రదర్శన ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది. కరతాళధ్వనుల మధ్య “నృత్యతి -- నృత్యతి” కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

క్రీడాకారుల ఖిల్లాగా హన్మాజీపేట మారాలి

- ప్రతిమ ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ చెన్నమనేని వికాస్

వేములవాడ, ఆగస్టు 10: గ్రామీణ యువత క్రీడల్లో రాణించి హన్మాజీపేటను క్రీడాకారుల ఖిల్లాగా తీర్చిదిద్దాలని ప్రతిమ ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ చెన్నమనేని వికాస్ ఆకాంక్షించారు. గ్రామపంచాయతీ పాలకవర్గం విజ్ఞప్తి మేరకు ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు.



ఈ సందర్భంగా వికాస్ మాట్లాడుతూ యువత నిత్యం వ్యాయామం చేస్తూ ఆరోగ్యంగా ఉండాలని, క్రీడల్లో ప్రతిభను చాటాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఖేలో ఇండియా, టార్గెట్ ఒలింపిక్స్ వంటి పథకాలను గ్రామీణ క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్రీడాకారులకు అవసరమైన ప్రోత్సాహాన్ని అందించేందుకు ప్రతిమ ఫౌండేషన్ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని తెలిపారు.

కార్యక్రమంలో హన్మాజీపేట సర్పంచ్ జంకె మధు, వార్డు సభ్యులు, బీజేపీ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ మార్షియల్ ఆర్ట్ డిస్ట్రిక్ట్ ఛైర్మన్ లయన్ తెప్ప శ్రీనివాస్ కి గిన్నిస్ వరల్డ్ రికార్డు తై క్వాండో అవార్డు

ఆదివారం హైదరాబాదులోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం లో జే ఆర్ ఇంటర్నేషనల్ తై క్వాండో అకాడమీ మరియు సుమన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో 533 తై క్వాండో స్టూడెంట్స్ తోని గిన్నిస్ వరల్డ్ రికార్డ్ అటెమ్ట్ ఈవెంట్ నిర్వహించడం జరిగింది.



ఈ కార్యక్రమంలో గిన్నిస్ వరల్డ్ రికార్డ్ అధినేత స్వప్నిల్ మరియు వారి టీం పర్యవేక్షణలో 533 తై క్వాండో స్టూడెంట్స్ తోని వన్ అవర్ (ఒక గంట)లో ఒకేసారి పంచులు,కిక్కులు,బ్లాక్స్ మరియు పుంసే లు ఒక గంటలో వారు ఇచ్చిన టార్గెట్ ను పూర్తి చేయడం జరిగింది, అందుకు గాను ఈ ఆటెమ్ట్ కి గిన్నిస్ వరల్డ్ రికార్డు అవార్డు ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ మార్షల్ ఆర్ట్స్ డిస్టిక్ చైర్ పర్సన్ లయన్ తెప్ప శ్రీనివాస్ ప్రతిభను చూపినందుకు జె.అర్ ఇంటర్నేషనల్ తై క్వాండో అకాడమీ అధినేత మాస్టర్ గజేంద్ర కుమార్ చేతుల మీదుగా గిన్నిస్ వరల్డ్ రికార్డ్ తై క్వాండో ప్రశంసా పత్రము అందుకోవడం జరిగింది, ఈ అవార్డు తీసుకున్నందుకుగానునాగర్ కర్నూల్ లయన్స్ క్లబ్ సభ్యులు మరియు తై క్వాండో డిస్ట్రిక్ట్ సెక్రటరీ రవికుమార్ గారు,ట్రెషరర్ స్వాతి గారు అలాగే టైక్వాండో మాస్టర్స్ స్టూడెంట్స్ హర్షం వ్యక్తం చేశారు..

మళ్లీ జలజగడం...

హైదరాబాద్, ఆగస్టు 10, (న్యూస్ పల్స్)తెలంగాణలో ఎన్నికలకు ఇంకా సమయం ఉండగానే సెంటిమెంట్ రగులుతోంది. ప్రధానంగా "నీటి సెంటిమెంట్" తో ప్రతిపక్ష బీఆర్ఎస్ అధికార కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని ప్రయత్నిస్తుంది. తెలంగాణకు దక్కాల్సిన నీటిని ఏపీకి తరలిస్తున్నారని, గోదావరి, కృష్ణా నదీ జలాలపై రగడ మొదలయింది. తెలంగాణ హక్కులను ఆంధ్రప్రదేశ్ కు తాకట్టు పెడుతున్నారంటూ గులాబీ పార్టీ కాంగ్రెస్ పై మండి పడుతుంది. తన గురువు చంద్రబాబు కోసం గోదావరి, కృష్ణా నీటిని తెలంగాణకు దక్కకుండా ఏపీకి తరలించుకు పోతున్నా మౌనంగా ఉంటున్నారని ఆరోపణలను గుప్పిస్తుంది. దీనికి కాంగ్రెస్ పార్టీ ఘాటుగా కౌంటర్ ఇస్తుంది.తెలంగాణ చరిత్ర తెలంగాణ రాజకీయాల్లో 'నీళ్లు' అనేది కేవలం వనరు మాత్రమే కాదు, ఉద్యమ పునాది నుంచి బలమైన భావోద్వేగ సెంటిమెంట్. ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో "నీళ్లు, నిధులు, నియామకాలు" నినాదంలో నీళ్లే ప్రథమ స్థానంలో నిలిచాయి. సమైక్య రాష్ట్రంలో ప్రాజెక్టుల విషయంలో జరిగిన అన్యాయాన్ని ఎత్తిచూపుతూ రాజకీయ పార్టీలు ఎప్పుడూ ప్రజలను ఏకం చేస్తుంటాయి. తెలంగాణ ఉద్యమం వచ్చిందే నీళ్లు, నిధులు, నియామకాలు. సెంటిమెంట్ మానంగా దక్కాల్సిన కృష్ణా, గోదావరి జలాలు పాలకుల నిర్లక్ష్యంతో సీమాంధ్రకు తరలిపోయాయనే ఆవేదన తెలంగాణ సమాజంలో ఉండేది. తాగు, సాగునీరు అందక ఎండిన భూములు, వలసల నేపథ్యమే తెలంగాణ రాజకీయ అస్తిత్వానికి ప్రధాన ప్రాతిపదికగా మారింది. ఏ పార్టీ అధికారంలో ఉన్నా నీటి హక్కుల రక్షణే ప్రధాన అజెండాగా సాగుతోంది. గోదావరి, కృష్ణా నదీ జలాల కేటాయింపులు, బోర్డుల సమావేశాల అజెండాలు రాష్ట్రంలో తరచూ తీవ్ర రాజకీయ రగడకు దారితీస్తున్నాయి.పక్క రాష్ట్రాల ప్రాజెక్టుల విస్తరణ లేదా కొత్త ప్రతిపాదనలు పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుల విషయంలో కేంద్రం వద్ద రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుకోవడంలో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధాలు జరుగుతున్నాయి. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం తమదే నీటి హక్కుల పరిరక్షణ అంటుంటే, రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారని బీఆర్ఎస్ తదితర ప్రతిపక్షాలు సెంటిమెంట్ అస్త్రం ప్రయోగిస్తున్నాయి. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, ఎత్తిపోతల పథకాల ప్రారంభాలు ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే కీలక శక్తిగా ఉంటాయి.నీటి కేటాయింపుల్లో అన్యాయం జరుగుతోందనే చిన్న సంకేతం కూడా తెలంగాణలో వెంటనే బలమైన రాజకీయ వ్యతిరేకతను, సెంటిమెంట్ను రగిలిస్తుంది. మరి ఈ సెంటిమెంట్ ఎప్పటి వరకూ కొనసాగిస్తారో.. ఎవరు అధిగమించి అధికారాన్ని చేపడతారో చూడాల్సి ఉంది.

బీసీల సెంట్రిక్ గా కవిత



హైదరాబాద్, ఆగస్టు 10, (న్యూస్ పల్స్)తెలంగాణ రక్షణ సేన పేరుతో కొత్త పార్టీ పెట్టుకున్న మాజీ ఎంపీ, మాజీ సీఎం కేసీఆర్ తనయ కవిత.. ఇప్పుడు వ్యూహం మార్చుకున్నట్టు తెలుస్తోంది. నిన్న మొన్నటి వరకు తెలంగాణ సెంటిమెంటు, ఉద్యమ కారులు.. వారి హక్కులు, ఉద్యోగాలు అంటూ.. రాజకీయ నినాదాలు చేసిన కవిత.. వీటి వల్ల వర్కవుట్ కాదని అర్థం చేసుకున్నట్టుగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆమె.. తన పంథాను సమూలంగా మార్చుకు న్నట్టు కనిపిస్తున్నారు.ప్రస్తుతం తెలంగాణలో బీసీ సామాజిక వర్గం అధికారిక లెక్కల ప్రకారం.. 43 శాతం మంది ఉన్నారు. అనధికారికంగా 50 శాతం వరకు ఉంటారని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో బీసీలను తనవైపు తిప్పుకునే దిశగా కవిత రాజకీయాలకు పదును పెట్టినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం బీసీ ఓటు బ్యాంకు నికరంగా ఎవరికీ ఎడాప్ట్ కాలేదు. బీఆర్ఎస్ అయినా.. బీసీ గణనను తొలిసారి నిర్వహించామని చెబుతున్న కాంగ్రెస్ పార్టీకైనా బీసీలు పూర్తిగా అంకితం కాలేదు. ఈ నేపథ్యంలో వారిని తనకు అనుకూలంగా మార్చుకునేందుకు కవిత ప్రయత్నం చేస్తున్నారు.ఈ నేపథ్యంలోనే బీసీల హక్కుల సాధన, ఏపీలో చేస్తున్న బీసీల రక్షణ హక్కు చట్టం తరహాలో తెలంగాణలోనూ బీసీలకు రక్షణ హక్కు తీసుకురావాలని ఆమె డిమాండ్ చేస్తున్నారు. అంతేకాదు.. రాజకీయంగా అదేవిధంగా రాజ్యాంగ పరంగా కూడా.. బీసీలకు 50 శాతం పదవులు కేటాయించాలని కోరుతున్నారు. వాస్తవానికి కవిత బీసీ కాకపోయినా.. ఆ వర్గాన్ని తనదైన శైలిలో తనవైపు తిప్పుకొనేందుకు బీసీల సమస్యలను భుజాని వేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. కేవలం నినాదాలకే పరిమితం కారాదని కూడా కవిత నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది.బీసీల కోసం ఉద్యమం చేయాలనే దిశగా కవిత ఆలోచన చేస్తున్నారు. ముఖ్యంగా పార్లమెంటు నుంచే ఆమె పని ప్రారంభించనున్నట్టు తెలుస్తోంది. గతంలో తెలంగాణ సాధన కోసం కేసీఆర్ వెయ్యి కార్లతో పార్లమెంటుకు పెరేడ్ నిర్వహించిన తరహాలో బీసీల కోసం.. వెయ్యి కార్లతో పార్లమెంటుకు పెరేడ్ నిర్వహించి.. ఢిల్లీ నుంచే తన వ్యూహాన్ని పెంచాలని నిర్ణయించారు. దీనికి సంబంధించిన కార్యాచరణపై ప్రస్తుతం కవిత కసరత్తు చేస్తున్నారు. ఇది అయిన తర్వాత.. రాష్ట్ర వ్యాప్తంగా బీసీల కోసం ఉద్యమం నిర్మించి.. జిల్లాల వారీగా పర్యటనలు చేయాలనినిర్ణయించినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరి ఇది ఏమేరకు వర్కువుట్ అవుతుందో చూడాలి.

నిజాయితీ చాటుకున్న మేడ్చల్ బస్ డిపో సిబ్బంది

మేడ్చల్ ,ప్రయాణికుడు బస్సులో మరిచిపోయిన విలువైన వస్తువులతో కూడిన బ్యాగ్‌ను గుర్తించి సురక్షితంగా తిరిగి అప్పగించి మేడ్చల్ టీజీఎస్ఆర్టీసీ డిపో సిబ్బంది నిజాయితీని చాటుకున్నారు. శనివారం మేడ్చల్ డిపోకు చెందిన 215/2 సర్వీస్ బస్సు పటాన్‌చెరువు నుంచి సికింద్రాబాద్‌కు వెళ్తుండగా కేపీహెచ్‌బీ వద్ద ప్రశాంత్ అనే ప్రయాణికుడు బ్యాగ్‌తో బస్సు ఎక్కి, రాత్రి 1.15 గంటలకు ప్యాట్ని వద్ద దిగిపోయారు. అనంతరం బస్సు తిరుగు ప్రయాణంలో ఉండగా కండక్టర్ గోవింద్ బ్యాగ్‌ను గుర్తించి డిపో అసిస్టెంట్ మేనేజర్ అఎ జి. రామారావు, విజిలెన్స్ అధికారులకు సమాచారం అందించారు. బ్యాగ్‌లో సుమారు రూ.2 లక్షల నగదు, ఆపిల్ ల్యాప్‌టాప్, రెండు పర్సులు, చార్జర్, దుస్తులు, ఆఫీస్ ఐడీ కార్డు తదితర వస్తువులు ఉన్నట్లు గుర్తించారు.

95 తెలంగాణ పీబ్లిక్ స్కూల్స్ కు గ్రీన్‌సిగ్నల్

హైదరాబాద్, ఆగస్టు 10, (న్యూస్ పల్స్) ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచడంతోపాటు విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు అందించాలన్న లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటులో కీలక ముందడుగు పడింది. రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా 100 టీపీఎస్‌లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించగా.. ఇప్పటికే తొలి మోడల్ పాఠశాలగా రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్లలో ఏర్పాటు చేసిన స్కూల్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ పాఠశాలలో ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఇంగ్లిష్ మీడియంలో విద్య అందించేలా సదుపాయాలు కల్పించారు.తాజాగా మరో 95 పాఠశాలల నిర్మాణానికి సంబంధించిన ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసింది. వీటి నిర్మాణానికి మొత్తం రూ.928 కోట్ల వరకు వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేశారు. ఒక్కో పాఠశాలకు భూమి, భవన పరిమాణం, మౌలిక సదుపాయాలను బట్టి సుమారు రూ.8 కోట్ల నుంచి రూ.14 కోట్ల వరకు ఖర్చు కానుంది. నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఈ పాఠశాలలను ఏర్పాటు చేయాలన్న ఉద్దేశంతో జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో అంచనాలు రూపొందించి పాఠశాల విద్యాశాఖకు పంపించారు. 95 పాఠశాలల నిర్మాణాలకు అవసరమైన పరిపాలనా అనుమతుల కోసం పాఠశాల విద్యాశాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించారు. ముఖ్యమంత్రి ఆమోదం అనంతరం ఉత్తర్వులు వెలువడితే టెండర్ల ప్రక్రియ ప్రారంభించే అవకాశం ఉంది. వీలైనంత త్వరగా పనులు మొదలుపెట్టి నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యంగా 2027-28 విద్యా సంవత్సరం నుంచి పాఠశాల విద్యలో ఇంటర్మీడియట్ విద్యను విలీనం చేయాలన్న నిర్ణయం నేపథ్యంలో టీపీఎస్‌ల నిర్మాణానికి ప్రాధాన్యం పెరిగింది.ఈ పాఠశాలలకు అవసరమైన నిధుల్లో 70 శాతం, అంటే సుమారు రూ.650 కోట్లను ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ రుణం ద్వారా సమకూర్చాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. మిగిలిన 30 శాతం నిధులను రాష్ట్ర బడ్జెట్ నుంచి కేటాయించనున్నారు. విద్యారంగ మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏఐఐబీ, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ నుంచి భారీగా రుణాలు సమీకరించే ప్రణాళికలో భాగంగానే ఈ నిధులను వినియోగించనుంది. రుణం అందడంలో ఆలస్యం ఏర్పడినా పనులు ఆగిపోకుండా రాష్ట్ర నిధులతో తొలిదశ నిర్మాణ పనులను ప్రారంభించాలని అధికారులు యోచిస్తున్నారు. ఏఐఐబీ తరఫున కన్సల్టెన్సీ ప్రతినిధులు రాష్ట్రంలో పర్యటిస్తూ సంబంధిత అధికారులతో ప్రాజెక్టు అమలు, మౌలిక సదుపాయాలు, నిర్మాణ ప్రమాణాలపై చర్చలు జరుపుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.టీపీఎస్‌లను కేవలం పాఠశాల భవనాలుగా కాకుండా విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అనువైన క్యాంపస్‌లుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కనీసం నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ఇప్పటికే కొనసాగుతున్న ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్య అందించేలా మౌలిక వసతులు కల్పించనున్నారు. తరగతి గదులతోపాటు డిజిటల్ లెర్నింగ్ సదుపాయాలు, లైబ్రరీలు, ఆధునిక సైన్స్ ల్యాబ్‌లు, క్రీడా మైదానాలు, సాంస్కృతిక కార్యక్రమాలకు అవసరమైన వసతులు, రవాణా సౌకర్యాలను కల్పించనున్నారు. ఆరుట్ల టీపీఎస్‌లో ఇప్పటికే ఆధునిక తరగతి గదులు, లైబ్రరీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ ల్యాబ్‌లు, డిజిటల్ క్లాసులు, క్రీడా వసతులు, ఉచిత రవాణా వంటి సదుపాయాలను అందుబాటులోకి తెచ్చారు.విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్ అందించడంతోపాటు పాలు కూడా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. పాఠశాల స్థాయిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విద్యను ప్రవేశపెట్టే దిశగా కూడా ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఇప్పటికే అచ్చంపేట, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాలకు రెండేసి టీపీఎస్‌లు మంజూరు కాగా.. గజ్వేల్‌కు కూడా పాఠశాలను కేటాయించారు. ఆరుట్లలో ప్రారంభమైన తొలి టీపీఎస్ నమూనాగా మిగిలిన పాఠశాలలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. మొత్తంగా 100 టీపీఎస్‌ల ఏర్పాటుతో ప్రభుత్వ విద్యపై తల్లిదండ్రుల్లో విశ్వాసాన్ని పెంచి, పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది

బిగ్ ప్లాన్ లో బీజేపీ



హైదరాబాద్, ఆగస్టు 10, (న్యూస్ పల్స్) తెలంగాణలో అధికారాన్ని చేజిక్కించుకోవడమే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ తన వ్యూహాలకు పదును పెడుతోంది. దక్షిణ భారతదేశంలో కర్ణాటక తర్వాత పట్టు సాధించేందుకు తీవ్రంగా శ్రమిస్తున్న కమలనాథులు, ఈసారి ఎలాగైనా తెలంగాణ గద్దెనెక్కాలనే స్పష్టమైన దిశానిర్దేశంతో ముందుకెళ్తున్నారు. ఈ క్రమంలో ఢిల్లీ వేదికగా ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ సమక్షంలో జరిగిన కీలక సమీక్షా సమావేశం, రాబోయే రోజుల్లో బీజేపీ అనుసరించబోయే రాజకీయ వ్యూహానికి ఒక స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను అందించింది.తెలంగాణ బీజేపీకి ప్రధాన ప్రతిబంధకంగా మారిన పాత, కొత్త నేతల మధ్య విభేదాలను, అంతర్గత కలహాలను వెంటనే పక్కన పెట్టాలని పార్టీ అధిష్ఠానం స్పష్టం చేసింది. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్, డీకే అరుణ, కొండ విశ్వేశ్వర్ రెడ్డి, లక్ష్మణ్, రఘునందన్ రావు సహా ముఖ్య నేతలందరూ ఒకే తాటిపైకి వచ్చి పోరాడాలని అధిష్ఠానం స్పష్టం చేసింది. గతంలో కరీంనగర్, మేడ్చల్ అర్బన్, వికారాబాద్ జిల్లాల పార్టీ అధ్యక్షుల నియామకంపై నలుగుతున్న వివాదాలను సైతం బండి సంజయ్, ఈటల రాజేందర్, కొండ విశ్వేశ్వర్ రెడ్డిల సూచనలకు ప్రాధాన్యం ఇస్తూ సర్దుబాటు చేయడం ద్వారా పార్టీ శ్రేణుల్లో ఐక్యతను నింపే ప్రయత్నం జరిగింది.భవిష్యత్తులో బిఆర్ఎస్ లేదా ఇతర పార్టీలతో పొత్తులు ఉంటాయనే ప్రచారాలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ముగింపు పలికారు. రాబోయే ఎన్నికల్లో జీహెచ్ఎంసీ సహా ఏ ఎన్నికల్లోనైనా తెలంగాణలో ఏ ఇతర పార్టీతోనూ పొత్తు ఉండదని, ఒంటరిగానే పోటీ చేస్తామని తేల్చి చెప్పారు. జాతీయ స్థాయిలో ఎన్డీయే భాగస్వామ్య పక్షాలతో సమీకరణాలు వేరైనా, తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు, పార్టీ స్వయం సమృద్ధి దృష్ట్యా ఒంటరి పోరాటమే శ్రేయస్కరమని పార్టీ భావిస్తోంది. గత ఎన్నికల్లో 119 నియోజకవర్గాల్లో గణనీయమైన ఓటు బ్యాంకు సాధించామని, నియోజకవర్గాల పునర్విభజన అనంతరం సీట్ల సంఖ్య పెరిగితే సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేంత సత్తా సాధిస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, ప్రజల్లో ఉన్న అసంతృప్తిని క్షేత్రస్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యంగా బీజేపీ కార్యాచరణ సిద్ధం చేస్తోంది. ప్రధానంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, యువత సమస్యలపై పార్టీ అసెంబ్లీ కన్వీనర్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి నాయకత్వంలో ధర్నాలు, నిరసనలు చేపడుతోంది. దీనికి తోడు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలైన 'ప్రధాన మంత్రి ఆవాస్ యోజన' వంటి ఫలాలను పేదలకు చేరకుండా రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకుంటోందనే అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని నిర్ణయించారు.మండల స్థాయి నుంచి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల వరకు ప్రతి నెలా నిలకడగా సమీక్షలు నిర్వహిస్తూ, ప్రతీ మూడు నెలలకోసారి కేంద్రీయ నేతలు రాష్ట్రాన్ని సందర్శించేలా పక్కా ప్రణాళిక రూపుదిద్దుకుంది. నేతల మధ్య ఉన్న చిన్న చిన్న భేదాభిప్రాయాలు పక్కనబెట్టి, వ్యూహాత్మకంగా ముందుకు సాగితే తెలంగాణ పీఠం దక్కడం అసాధ్యమేమీ కాదని కమలనాథులు భావిస్తున్నారు.బీజేపీ అధిష్ఠానం తెలంగాణ రాజకీయాల్లో మరో మలుపు తీసుకుంటూ వ్యూహాత్మకంగా కదులుతోంది. ఒకవైపు వచ్చే ఏడాది ఎన్నికలు జరిగే పంజాబ్, గుజరాత్‌లో గెలుపుపై దృష్టి సారించిన కమలం పార్టీ మరోవైపు దరక్షిణాన పట్టు బిగించే ప్రయత్నం చేస్తోంది. ఇందులో భాగంగా కర్ణాటక తర్వాత గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్న తెలంగాణలో పార్టీలో జోష్ పెంచడంతోపాటు అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయంగా ఎదిగేలా వ్యూహాలు రూపొందిస్తోంది. త్వరలో జరగబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలు, రాబోయే అసెంబ్లీ పోరులో విజయం సాధించాలనే లక్ష్యంతో కేంద్ర స్థాయి నుంచి స్పష్టమైన దిశానిర్దేశం జరుగుతున్నట్లు కనిపిస్తోంది. ఢిల్లీని వేదికగా రాష్ట్ర నాయకుల సమావేశాలు జరగడం, పార్టీలో సమన్వయాన్ని పెంచే ప్రయత్నాలు ఈ వ్యూహానికి ప్రధాన అంశాలుగా మారాయి.పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు రెండింటిలోనూ బలమైన పనితీరు చూపాలనే ఆలోచనతో బీజేపీ అధిష్ఠానం పని చేస్తోంది. హైదరాబాద్‌లోని మున్సిపల్ ఎన్నికలు పార్టీకి కీలక పరీక్షగా మారనున్న నేపథ్యంలో, రాష్ట్ర స్థాయి నాయకత్వం, కార్యకర్తల సమన్వయం, సంస్థాగత బలం పెంచే దిశగా చర్చలు సాగుతున్నాయి. కేవలం ఎన్నికల క్యాంపెయిన్‌కు మాత్రమే పరిమితం కాకుండా, దీర్ఘకాలిక రాజకీయ బలాన్ని నిర్మించే దృష్టితో వ్యూహాలు రూపొందుతున్నట్లు అర్థమవుతోంది.ఢిల్లీలోని కేంద్ర మంత్రి బండి సంజయ్ నివాసం రాష్ట్ర నాయకుల సమావేశాలకు ముఖ్య వేదికగా మారింది. ఇక్కడ జరుగుతున్న చర్చలు కేవలం సాధారణ సమావేశాలుగా కాకుండా, భవిష్యత్ కార్యాచరణపై కీలక నిర్ణయాలకు దారితీస్తున్నాయి. రాష్ట్ర స్థాయి నాయకులు, కేంద్ర నాయకత్వం మధ్య నేరుగా సంప్రదింపులు జరగడం వల్ల సమస్యలను త్వరగా గుర్తించి, పరిష్కార మార్గాలు చర్చించే అవకాశం ఏర్పడుతోంది. ఇది పార్టీలో కమ్యూనికేషన్ గ్యాప్‌ను తగ్గించే దిశగా ఉన్నట్లు కనిపిస్తోంది.పార్టీలోని వర్గ విభేదాలను అధిగమించి, ఐక్యంగా ముందుకు సాగుతున్నట్లు కనిపిస్తోంది. సామాజిక సమీకరణాలే నినాదం అధిష్ఠానం నుంచి స్పష్టంగా వస్తోంది. జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌తో జరిగిన చర్చల్లో ఈ అంశం ప్రాధాన్యం పొందినట్లు సమాచారం. ఎన్నికల్లో విజయం సాధించాలంటే అంతర్గత సమస్యలు అడ్డంకిగా మారకూడదనే అవగాహనతో, నాయకుల మధ్య సమన్వయం పెంచే చర్యలు చేపట్టబడుతున్నాయి. పార్టీ సంస్థాగత బలాన్నిపెంచి,కార్యకర్తల్లో ఆత్మవిశ్వాసం పెంచే అవకాశం కలిగిస్తుంది .ఢిల్లీలో జరుగుతున్న ఈ కదలికలు తెలంగాణలో బీజేపీ స్థానిక స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు బలోపేతం చేసే ప్రయత్నంగా భావిస్తున్నారు. ఎన్నికలకు ముందు అంతర్గత ఐక్యతను నిర్ధారించుకోవడం, స్పష్టమైన బాధ్యతల పంపిణీ, కార్యాచరణ ప్రణాళికలు రూపొందించడం వంటివి ఇప్పుడు ప్రాధాన్యం పొందుతున్నాయి. ఈ వ్యూహం ఎంతవరకు ఫలితాలు ఇస్తుందనేది రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులు, ప్రతివక్షాల వనితీరు, ప్రజా స్పందనపై ఆధారపడి ఉంటుంది. అయితే అధిష్ఠానం స్పష్టమైన దిశానిర్దేశం ఇవ్వడం, సమన్వయాన్ని ప్రోత్సహించడం పార్టీకి సానుకూల సంకేతంగా నిలుస్తోంది.మొత్తంమీద ఢిల్లీ వేదికగా జరుగుతున్న ఈ చర్చలు, సమావేశాలు తెలంగాణలో బీజేపీ రాజకీయ వ్యూహాన్ని మరింత స్పష్టం చేస్తున్నాయి. ఎన్నికల లక్ష్యం, అంతర్గత ఐక్యత, సంస్థాగత సమన్వయం ఈ మూడు అంశాలపై దృష్టి సారించి అధిష్ఠానం ముందుకు సాగుతున్నట్లు కనిపిస్తోంది.

టీపీసీసీలో నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్లు..

సామాజిక సమతుల్యతకు ప్రాధాన్యం

హైదరాబాద్, ఆగస్టు 10, (న్యూస్ పల్స్)తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(టీపీసీసీ) నిర్మాణంలో ముఖ్యమైన మార్పులు రాబోతున్నట్లు కనిపిస్తోంది. పార్టీ అధికార వర్గం ఒకే వ్యక్తి చేతుల్లో అధికారం కేంద్రీకరించకుండా, వివిధ సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించే దిశగా అడుగులు వేస్తోంది. రాష్ట్ర రాజకీయాల్లో కుల, వర్గ సమతుల్యతను కాపాడుకోవాలని వ్యూహాత్మకంగా టీపీసీసీ అడుగులు వేస్తోంది.పార్టీ ఇన్‌చార్జి మీనాక్షి ఆధ్వర్యంలో జరిగిన కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలోనే ఈ విషయం ప్రధానంగా చర్చకు వచ్చింది. ఎఐసీసీ స్థాయి నుంచి టీపీసీసీలో నాలుగు వర్కింగ్ ప్రెసిడెంట్లను నియమించాలనే ప్రతిపాదనకు అంతా ఓకే చెప్పారు. ఇది స్థానిక నాయకత్వం, కేంద్ర నాయకత్వం మధ్య సమన్వయంతో జరుగుతున్న ప్రక్రియను సూచిస్తుంది. కేవలం ఒక చీఫ్‌పైనే భారం పడకుండా, బహుళ నాయకత్వ నమూనాను అమలు చేయాలనే ఉద్దేశం స్పష్టంగా కనిపిస్తోంది.ప్రస్తుత పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ బీసీ నేపథ్యం నుంచి వచ్చినవారు కావడం ఈ నిర్ణయానికి మూలకారణం. ఒక వర్గం మాత్రమే ఆధిపత్యం చెలాయించకుండా, ఇతర సామాజిక వర్గాల నుంచి ప్రతినిధులను తీసుకురావాలనే స్పష్టమైన ఆలోచన ఉంది. దీని ద్వారా పార్టీ లోపలి అసంతృప్తిని తగ్గించి, విస్తృత సామాజిక ఆధారాన్ని బలోపేతం చేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అనిపిస్తోంది.సామాజికవర్గాల వారీగా సముత్యం పాటిస్తు నలుగురిని ఎంపిక చేసినట్లు తెలిసింది. ఇక ఆమోదముద్రే తరువాయి అని తెలుస్తోంది. ఎంపిక చేసిన నలుగురు పేర్లను పీసీసీ జాతీయ నాయకత్వానికి పంపినట్లు సమాచారం. ఎంపిక చేసినవారిలో ఎస్సీ వర్గం నుంచి సంపత్ కుమార్, ఎస్టీ వర్గం నుంచి బలరాం నాయక్, మైనారిటీ వర్గం నుంచి అజ్మతుల్లా లేదా ఒబైదుల్లా, ఓసీ వర్గం నుంచి రోహిన్ రెడ్డి లేదా పద్మావతి రెడ్డికి అవకాశం దక్కనుంది.వర్కింగ్ ప్రెసిడెంట్లతోపాటు ప్రచార కమిటీ ఛైర్మన్ పదవి కూడా చర్చనీయాంశమైంది. ఈ పదవికి జగ్గారెడ్డి పేరు బలంగా వినిపిస్తోంది. ప్రచార వ్యూహాలు, సందేశాల రూపకల్పనలో అనుభవం ఉన్న నాయకులను ముందుంచడం పార్టీ ప్రచార యంత్రాంగాన్ని బలోపేతం చేసే ప్రయత్నంగా చూడవచ్చు.నాలుగు వర్కింగ్ ప్రెసిడెంట్ల నియామకం టీపీసీసీని మరింత వికేంద్రీకృతంగా మార్చగలదు. ఒకే వ్యక్తి నిర్ణయాలపై ఆధారపడకుండా, వివిధ వర్గాలు, ప్రాంతాలు, సమస్యలపై సమాంతరంగా పని చేసే అవకాశం ఏర్పడుతుంది. అయితే, ఇలాంటి బహుళ నాయకత్వ నమూనా విజయవంతం కావాలంటే స్పష్టమైన బాధ్యతల పంపిణీ, సమన్వయం అవసరం.

చెడు నడత కలిగిన వ్యక్తులకు పోలీసుల ప్రత్యేక కౌన్సెలింగ్

ప్రకాశం ,జిల్లా పోలీసులు ప్రజా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే కార్యకలాపాలకు పాల్పడే అవకాశం ఉన్న చెడు నడత కలిగిన వ్యక్తులకు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. నేరాలను నివారించడం, మంచి ప్రవర్తనను పెంపొందించడం, సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా జీవించేలా ప్రోత్సహించడం ఈ కౌన్సెలింగ్ ప్రధాన ఉద్దేశ్యం ఇకపై ఎలాంటి నేర కార్యకలాపాలకు పాల్పడకుండా శాంతియుతంగా, చట్టబద్ధంగా జీవించాలని పోలీసులు సూచించారు. గొడవలు, దాడులు, బెదిరింపులు, వసూళ్లు, అక్రమ సెటిల్మెంట్లు, ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం, ప్రజా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఇతర కార్యకలాపాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. చెడు సావాసాలకు దూరంగా ఉండి, కుటుంబ బాధ్యతలు, ఉద్యోగం మరియు విద్యపై దృష్టి సారిస్తూ సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా జీవించాలని హితవు పలికారు. భవిష్యత్తులో నేర కార్యకలాపాలకు పాల్పడితే, సంబంధిత చట్ట నిబంధనల ప్రకారం తగిన చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని స్పష్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు సహకరిస్తూ, మంచి ప్రవర్తనతో సమాజంలో గౌరవప్రదమైన జీవితం గడపాలని కౌన్సెలింగ్ ఇచ్చారు. కౌన్సెలింగ్ లక్ష్యం: నేరాలను నివారించడం, చెడు ప్రవర్తనను మార్చడం, బాధ్యతాయుతమైన జీవన విధానాన్ని అలవర్చడం మరియు భవిష్యత్తులో ఎటువంటి నేర కార్యకలాపాలకు పాల్పడకుండా వ్యక్తులను సన్మార్గంలో నడవాలని సూచించారు.

టీఆర్టీఎఫ్ కట్టంగూరు మండల శాఖ నూతన ప్రధాన కార్యదర్శిగా పెండెం శ్రీనివాసులు



రామగిరి, ఆగస్టు 10 : తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టి ఆర్ టి ఎఫ్) కట్టంగూర్ మండల నూతన ప్రధాన కార్యదర్శిగా పెండెం శ్రీనివాసులు, స్కూల్ అసిస్టెంట్ (హిందీ), జడ్పీహెచ్ఎస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం జరిగిన మండల సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారెడ్డి అంజిరెడ్డి ఎన్నిక ధ్రువీకరణ పత్రాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కట్టంగూరు మండలంలో టి ఆర్ టి ఎఫ్ సంఘ బలోపేతానికి, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పెండెం శ్రీనివాసులు ఈ సందర్భంగా తెలిపారు. మండల శాఖ అధ్యక్షుడు చిట్టబోయిన లింగయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తరాల పరమేశ్ యాదవ్, రాష్ట్ర గౌరవ సలహాదారు ముప్పిడి మల్లయ్య పాల్గొన్నారు.

నేను డీసీఎంపై నుంచి కిందపడకుండా కాపాడింది పెద్ది సుదర్శన్ రెడ్డి.. హరీశ్‌రావు భావోద్వేగం



నల్లబెల్లిలో దివంగత నేత పెద్ది సుదర్శన్ రెడ్డి సంతాప సభలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు పాల్గొని నివాళులు అర్పించారు. సంతాప సభలో హరీశ్ రావు మాట్లాడుతూ.. ఉద్యమ సమయంలో పెద్ది సుదర్శన్ రెడ్డితో తనకున్న జ్ఞాపకాలు గుర్తు చేసుకొని కన్నీళ్లు పెట్టుకున్నారు. మొన్న పెద్ది సుదర్శన్ రెడ్డి ఆస్పత్రిలో పడితే నేను, కేటీఆర్ ఆగమేఘాల మీద పరుగెత్తుకుంటూ వచ్చాం. వచ్చే సరికి ఆస్పత్రి చూస్తే నాకొక పాత జ్ఞాపకం గుర్తొచ్చింది. ఒక ఉద్యమకారుడు తెలంగాణలో ఆత్మహత్య చేసుకుంటే డీసీఎంపై ఆ అమరుడి అంతిమయాత్ర జరుగుతుంది. ఆ అంతిమ యాత్ర జరుగుతుంటే వరంగల్‌లోని అమరవీరులస్థూపం వద్ద పోలీసులకు, మనకు మధ్య బాగా ఘర్షణ అయింది. ఆ ఘర్షణలో నేను డీసీఎంపై నుంచి కిందపడ్డానన్నారుడీసీఎంపై నుంచి కిందపడ్డప్పుడు నన్ను పట్టుకున్నది పెద్ది సుదర్శన్ రెడ్డి. నేను భూమి మీద పడాలి. కానీ నేను ఆయన చేతుల పడి కిందపడ్డా ఆరోజు. వెంటనే సుదర్శన్ రెడ్డి నన్ను ఆస్పత్రికి తీసుకెళ్లిండు. ఆ రోజు ఏ ఆస్పత్రికైతే సుదర్శన్ రెడ్డి నన్ను తీసుకపోయిండో.. పాపం ఆ ఆస్పత్రిలో సుదర్శన్‌రెడ్డిని చివరి చూపు కూడా చూస్తానని కలలు కూడా కనలేదు. అప్పుడు నాకు దెబ్బతాకితే ఆగమేఘాల మీద సుదర్శన్ రెడ్డి నన్ను ఆ ఆస్పత్రికి తీసుకపోయిండు. పాపం సుదర్శన్ రెడ్డి చివరి దశలో ఆ ఆస్పత్రిలో ఉన్నడని కన్నీంటి పర్యంతమయ్యారు.

నకిలీ లింక్‌లతో జాగ్రత్త.. చందాదారులకు ఈపీఎఫ్ఓ సూచన

ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ(ఈపీఎఫ్ఓ) చందాదారులను అప్రమత్తం చేసింది. నకిలీ వెబ్‌సైట్లు, లింక్‌లు, మోసపూరిత మెసేజ్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించింది. ఈ మేరకు ఎక్స్ వేదికగా చందాదారులకు హెచ్చరికలు జారీ చేసింది. పీఎఫ్ సేవలు పొందే సమయంలో వెబ్ లింక్‌లను పరిశీలించి.. వ్యక్తిగత వివరాలను భద్రంగా ఉంచుకోవాలని పేర్కొంది.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి..

పీఎఫ్ సేవల కోసం అధికారిక ఈపీఎఫ్ఓ వెబ్‌సైట్‌ను మాత్రమే వినియోగించాలి.

ఎస్ఎంఎస్, వాట్సాప్, సోషల్ మీడియా, ఈమెయిల్‌లో వచ్చే గుర్తు తెలియని లింక్‌లను క్లిక్ చేయొద్దు.

లాగిన్ చేసే ముందు వెబ్‌సైట్ మినహా ఇతర సైట్లలో యూఏఎన్, పీపీఓ, పాస్‌వర్డ్, ఆధార్, పాన్, బ్యాంక్ వివరాలు, ఓటీపీ వంటి సమాచారాన్ని నమోదు చేయొద్దులాగిన్ చేసే ముందు వెబ్‌సైట్ యూఆర్ఎల్‌ను జాగ్రత్తగా పరిశీలించాలి. అక్షరాల్లో స్వల్ప మార్పులు, అనుమానాస్పద డొమైన్ పేర్లు ఉన్నాయోమో చూడాలి.అనుమానాస్పద వెబ్‌సైట్లు, మెసేజ్‌లు కనిపిస్తే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలిఫోన్ కాల్, ఎస్ఎంఎస్, వాట్సాప్, సోషల్ మీడియా లేదా ఈమెయిల్ ద్వారా ఈపీఎఫ్ఓ ఎప్పుడూ ఓటీపీ, వ్యక్తిగత వివరాలు లేదా లాగిన్ సమాచారాన్ని అడగదని గుర్తుంచుకోవాలి.డిజిటల్ విధానంలో పీఎఫ్ సేవలను వినియోగించే వారి సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ మోసగాళ్లు నకిలీ వెబ్‌సైట్లు, లింక్‌లతో వినియోగదారులను మోసగించే అవకాశం ఉందని ఈపీఎఫ్ఓ పేర్కొంది. అధికారిక సైట్ నుంచే సేవలను పొందాలని సూచించింది. గుర్తుతెలియని సందేశాల్లో వచ్చే లింక్‌లను నమ్మకుండా.. ఈపీఎఫ్ఓ అధికారిక వెబ్‌సైట్‌ను స్వయంగా వెరిపై చేసి సేవలను వినియోగించుకోవాలని స్పష్టం చేసింది.



విద్యార్థుల నిరసన అంశంపై చర్చకు అమిత్ షా సిద్ధం.. పార్లమెంట్‌లో వెల్లడించిన కిరణ్ రిజిజు

న్యూఢిల్లీ ,పార్లమెంట్‌లో కొద్ది రోజులుగా కొనసాగుతున్న ప్రతిష్టంభనకు తెరపడనుంది. ఇటీవల సీజేపీ ర్యాలీ సందర్భంగా విద్యార్థులపై జరిగిన దాడి గురించి సమాధానం ఇచ్చేందుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా అంగీకరించారు. ఈ విషయాన్ని పార్లమెంట్ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు సోమవారం లోక్‌సభలో వెల్లడించారు. ఈ అంశంపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, హోం మంత్రి అమిత్ షా కూడా సమాధానం ఇస్తారని కిరణ్ రిజిజు ప్రకటించారు. విద్యార్థులపై జరిగిన దాడికి హోం మంత్రి రాజీనామా చేయాలని గతంలో లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు.తర్వాత రాహుల్ కాస్త వెనక్కు తగ్గారు. హోం మంత్రి రాజీనామా అవసరం లేదని, సభలో సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు ఈ అంశంపై కొద్ది రోజులుగా సభలో అందోళన చేస్తున్నాయి. మరోవైపు విద్యార్థులపై దాడి తర్వాత నుంచి అమిత్ షా సభకు హాజరు కాలేదు. దీంతో ఆయన సభకు రావాలని, సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ అంశంపై కిరణ్ రిజిజు సోమవారం సభలో మాట్లాడారు. విద్యార్థులపై దాడి అంశంపై పూర్తిస్థాయిలో చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అయితే, దీనికి ప్రతిపక్షాలు సహకరించాలని కోరారు. ఇదే సమయంలో హోం మంత్రి చెప్పబోయే సమధానాల్ని కూడా వినాలని సూచించారు. సభకు అడ్డుతగలడం సరికాదని కిరణ్ రిజిజు స్పష్టం చేశారు. అయినప్పటికీ, సభలో ప్రతిపక్షాలు ఆందోళన చేశాయి.సభా కార్యక్రమాలకు అడ్డుతగిలాయి. దీంతో సభను మంగళవారానికి వాయిదా వేశారు. సోమవారం కేంద్రం నాలుగు బిల్లులను సభలో ప్రవేశపెట్టింది. వీటిలో ట్రిబ్యునల్ రిఫార్మ్ బిల్, 2026కు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఒకపక్క ప్రతిపక్షాలు ఆందోళన చేస్తున్నా ఈ బిల్లు ఆమోదం పొందింది. ఈ బిల్లుపై సభలో ఎలాంటి చర్చా జరగకపోవడం విశేషం. అంతకుముందు సభలో వివిధ పక్షాలు వేర్వేరు అంశాలపై ఆందోళన చేశాయి. యూపీలోని రామ మందిరం విరాళాలపై చర్చించాలని ఎస్పీ డిమాండ్ చేసింది.



సింగపూర్‌లో వైభవంగా బోనాలు

సింగపూర్: 'తెలంగాణ కల్చరల్ సొసైటీ సింగపూర్ ' ఆధ్వర్యంలో ఆగస్టు 9 సాయంత్రం బోనాల జాతరను కనులపండువుగా నిర్వహించారు. ఈ వేడుకలను స్థానిక 'సుంగే కేదుట్'లోని శ్రీ అరసకేసరి శివాలయంలో భక్తిశ్రద్ధలతో చేపట్టారు. పోతరాజులు, పులివేషాలు, తొట్టెలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తెలంగాణ ప్రాంతానికి చెందిన వారే కాకుండా.. తెలుగు వారందరు సుమారు 850 నుంచి 900 మంది వరకు ఈ బోనాల ఉత్సవాల్లో పాల్గొన్నారు. బోనాల ఊరేగింపులో అమ్మవారి, బోనాలకు సంబంధించిన పాటలకు చిన్నాపెద్ద తేడా లేకుండా అందరూ కలిసి ఆడిపాడారు. తెలంగాణ మహిళలు భక్తి శ్రద్ధలతో దుర్గాదేవికి బోనాలు సమర్పించారు. ప్రజలందరికి మహంకాళి తల్లి ఆశీస్సులు ఉండాలని టీసీఎస్ఎస్ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు.తెలంగాణ సంప్రదాయంలో ప్రధాన భూమిక పోషించే బోనాల పండుగను తెలుగు వారందరు జరుపుకోవడం సంతోషంగా ఉందని టీసీఎన్ఎస్ సభ్యులు అన్నారు.బోనాల జాతరలో పోతరాజు, పులివేషాలతో జాతరకు కళ తెచ్చిన నేరెళ్ల శ్రీనాథ్, గౌడ సాయి కుమార్, అయిట్ల లక్ష్మణ్, లక్ష్మీపతి, అరవింద్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పారు. ఈ ఏడాది బోనం సమర్పించిన వారిలో శశిధర్ రెడ్డి, రమేష్ గడప, అలేఖ్య దార, అలేఖ్య తడిసిన, దీపా రెడ్డి మండల, బోయిని స్వరూప, శ్వేత కుంభం, బర్ల అరుణ్‌కుమార్, బైలపూడి గౌరీ వరలక్ష్మి, మోతె శ్రీనివాస రెడ్డి, బొందుగుల ఉమారాణి, అన్ను సుజాత ఉన్నారు. బోనం సమర్పించిన భక్తులకు తెలంగాణ కల్చరల్ సొసైటీ (సింగపూర్) బహుమతులు అందజేశారు. వీరితో పాటు గడప రమేశ్, బసిక ప్రశాంత్ కుమార్ అమ్మవారి కోసం తొట్టెలను స్వయంగా పేర్చి తీసుకుకొచ్చారు.సింగపూర్ బోనాలు 2026లో పాల్గొని విజయవంతం చేసిన, ఎల్లప్పుడూ సొసైటీకి సహకారం అందిస్తున్న ప్రతి ఒక్కరికి సొసైటీ అధ్యక్షులు నల్ల భాస్కర్ గుప్త, ప్రధాన కార్యదర్శి బొందుగుల రాము, కోశాధికారి శశిధర్ రెడ్డి ఎర్రమరెడ్డి, ఉపాధ్యక్షులు బసిక ప్రశాంత్ రెడ్డి, జూలూరి సంతోష్ కుమార్, మిర్యాల సునీత రెడ్డి, సంతోష్ వర్మ మాదారపు, విక్రమ్ చిట్ల సంస్థాగత కార్యదర్శి కాసర్ల శ్రీనివాస రావు, ప్రాంతీయ కార్యదర్శులు నంగునూరి వెంకట రమణ, నడికట్ల భాస్కర్, మహేష్ చెట్టిపెల్లి, కల్వ లక్ష్మణ్ రాజు, శివ ప్రసాద్ ఆవుల, కార్యవర్గ సభ్యులు బొడ్ల రోజా రమణి, రవికృష్ణ విజ్జాపూర్, పెరుకు శివరామ్ ప్రసాద్, విజయ మోహన్ వెంగళ, సతీష్ పెసరు, చల్లా క్రిష్ణ, మణికంఠ రెడ్డి, భాస్కర్ రావు పులిగిళ్ల, ప్రవీణ్ మామిడాల, తోట రాజేంద్ర ప్రసాద్, యసరావేణి విజయ కుమార్, మల్లారెడ్డి కల్లెం, సుఖేందర్ నీలం ధన్యవాదాలు తెలిపారు.ఈ వేడుకలకు మై హోమ్ బిల్డర్స్, కుమార్ ప్రాపర్టీస్ (ప్రాపెక్స్) సింగపూర్, యాఒ కన్‌స్ట్రక్షన్ కంపెనీ, సరిగమ గ్రాండ్ ఇండియన్ రెస్టారెంట్, వజ్రా రియల్ ఎస్టేట్ కన్‌స్ట్రక్షన్ అండ్ డెవలప్‌మెంట్ కంపెనీ, ఏపీజే అభిరామి, ఏపీజే జువెల్లర్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఎవోల్వ్, ఏవీఎం కన్‌స్ట్రక్షన్ అండ్ ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్, విజయ్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ (కూల్ టైమ్ ఎయిర్‌కాన్ ఇన్‌స్టాలేషన్ ఉ సర్వీస్), స్వాతి ఖానాపురం, సాయికృష్ణ కొమాకుల, నగేశ్ టేకూరి, నిఖిల్ పారుపల్లి, శ్రీధర్ మారోజు ఫ్రెండ్స్, రామాంజనేయులు చమిరాజు, అజయ్ నందగిరి, నరేష్ కుమార్ నొల్ల, అభిమల్ల గిరి ప్రసాద్, కొల్లా శివ ప్రసాద్, మునిగెల కృష్ణంరాజు, పాతూరి రాంబాబు, దండా నాగేశ్వర్ రెడ్డి, రెడ్డిపల్లి కృష్ణారావు, రవీంద్ర కుమార్ సహకారం అందించారు. ఈ వేడుకలకు కృష్ణ నెల్లుట్ల ఫొటోలు తీశారు. యసరావేణి విజయ కుమార్ మెరుగు సౌండ్ సాంకేతికత అందించారు.



అయోధ్య రామమందిర ట్రస్టు సీఈఓ పోస్టు.. ఇంటర్వ్యూకు 18 మంది ఎంపిక



అయోధ్య శ్రీ రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు సీఈఓ పోస్టుకు ఇంటర్వ్యూలు త్వరలో జరగనున్నాయి. ఈ పోస్టు కోసం 5,300 పైచిలుకు మంది దరఖాస్తు చేసుకోగా ఇంటర్వ్యూ కోసం 18 మందిని ఎంపిక చేసినట్టు ట్రస్టు వర్గాలు తెలిపాయి. మంగళ, బుధవారాల్లో ఆలయ ప్రాంగణంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. మాజీ న్యాయమూర్తి జస్టిస్ ప్రమోద్ కోహ్లీ, లెఫ్టినెంట్ జనరల్ విష్ణుకాంత్ చతుర్వేదీ, శ్రీ షిరిడీ సాయిబాబా సంస్థాన్ ట్రస్టు మాజీ చైర్మన్ సురేశ్ హవారేలతో కూడిన ప్యానెల్ అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహించనుంది.సీఈఓగా 50 నుంచి 70 ఏళ్ల మధ్య ఉన్న వ్యక్తిని ఎంపిక చేయనున్నట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. హిందూ మతాన్ని ఆచరించే వారు, శాకాహారులైన వారినే సీఈఓగా ఎంపిక చేయనున్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. రామమందిర వ్యవహారాలన్నిటినీ సీఈఓ పర్యవేక్షించాల్సి ఉంటుంది. రామమందిర విరాళాల చోరీ వెలుగులోకి రావడంతో ఇలాంటివి పునరావృతం కాకుండా సీఈఓను నియమించాలని ట్రస్ట్ నిర్ణయించిన విషయం తెలిసిందే.మరోవైపు, విరాళాలచోరీపై దర్యాప్తు కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ రిపోర్టు మేరకు పోలీసులు ఇప్పటికే ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి నగదును రికవరీ చేశారు. శుక్లా నుంచి అత్యధికంగా రూ.20.39 లక్షలను స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి బంగారం, వెండి నగలతో పాటు విదేశీ కరెన్సీని కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

అమిత్‌షా ప్రకటన ఇచ్చే వరకు పార్లమెంట్‌లో ప్రతిష్ఠంభన కొనసాగుతుంది: ప్రియాంక గాంధీ



న్యూఢిల్లీ, ఆగస్టు 10: పార్లమెంట్ మార్చ్ సందర్భంగా విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు లాఠీఛార్జ్ చేయడంపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా వివరణ ఇవ్వాలని ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ పట్టుబడుతోంది. ప్రకటన వచ్చేవరకు పార్లమెంట్‌లో అధికార, ప్రతిపక్షాల మధ్య ప్రతిష్ఠంభన కొనసాగుతుందని కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా తేల్చి చెప్పారు. సోమవారం పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో ప్రియాంక గాంధీ మీడియాతో మాట్లాడుతూ.. 'కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ప్రకటన ఇచ్చే వరకు పార్లమెంట్‌లో ప్రతిష్ఠంభన కొనసాగుతుంది' అని అన్నారు.ఢిల్లీ ఘటనపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా సమాధానం చెప్పి తీరాల్సిందేనని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. విద్యార్థులపై దాడి ఘటనపై ప్రకటన ఇవ్వడానికి ఆయన పార్లమెంట్‌కు రావాల్సిందేనని పట్టుబట్టారు. పోలీసుల దాడిలో యువతులు, మైనర్లు గాయపడ్డారని అన్నారు. కాల్పులపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరగాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు.

ఉత్తరాఖండ్‌లో భూకంపం.. 4.2 తీవ్రతతో ప్రకంపనలు



ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీ జిల్లాలో సోమవారం తెల్లవారుజామున భూమి కంపించింది. రిక్టర్ స్కేలుపై 4.2 తీవ్రతతో భూకంపం సంభవించినట్లు అధికారులు వెల్లడించారు. తెల్లవారుజామున 1:21 గంటల సమయంలో ప్రకంపనలు నమోదయ్యాయి. ఉత్తరకాశీ జిల్లాలోని బర్కోట్ తహసీల్ పరిధిలోని రాజ్‌గర్హి సమీపంలో భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు తెలిపారు. భూకంప కేంద్రం సుమారు 10 కిలోమీటర్ల లోతులో ఉన్నట్లు సమాచారం. ప్రకంపనల ప్రభావం ఉత్తరకాశీతో పాటు బర్కోట్, పురోలా, మోరి, చిన్యాలిసౌర్, దుండాతో పాటు యమునా లోయలోని పలు ప్రాంతాల్లో కనిపించింది. ఒక్కసారిగా భూమి కంపించడంతో పలువురు ప్రజలు భయాందోళనకు గురై ఇళ్ల నుంచి బయటకు వచ్చినట్లు సమాచారంభూప్రకంపనల కారణంగా ఇప్పటి వరకు ఎలాంటి ప్రాణనష్టం లేదా భారీగా ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం అందలేదు. అయితే తెల్లవారుజామున ప్రకంపనలు చోటుచేసుకోవడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. అధికారులు పరిస్థితిని పర్యవేక్షిస్తూ, వివిధ ప్రాంతాల నుంచి సమాచారం సేకరిస్తున్నారు. భూకంప ప్రభావంతో ఎక్కడైనా భవనాలు లేదా ఇతర నిర్మాణాలకు నష్టం వాటిల్లిందా అనే అంశాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అయితే అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ప్రకంపనల అనంతరం పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు జిల్లా యంత్రాంగం తెలిపింది.

ముస్లిం వివాహాలపై కర్ణాటక హైకోర్టు సంచలన తీర్పు



ముస్లిం వివాహాలపై కర్ణాటక హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. స్పెషల్ మ్యారేజ్ యాక్ట్ కింద రిజిస్ట్రేషన్ చేసుకున్నా.. ముస్లిం వివాహాలకు షరియా చట్టమే వర్తిస్తుందని కోర్టు స్పష్టం చేసింది. జస్టిస్ డీకే. సింగ్, జస్టిస్ టీఎమ్. నదాఫ్ ధర్మాసనం 'సజీద్ పర్వేజ్ ల/బ ఫర్జానా తాజ్' కేసులో ఫ్యామిలీ కోర్టు ఆదేశాలను సమర్థిస్తూ ఈ తీర్పునిచ్చింది. స్పెషల్ మ్యారేజ్ యాక్ట్ కింద విడాకులు కోరుతూ భర్త దాఖలు చేసిన పిటిషన్ చెల్లదని డివిజన్ బెంచ్ స్పష్టం చేసింది.'నికాహ్'ను స్పెషల్ మ్యారేజ్ యాక్ట్ (ూఓం) కింద నమోదు చేసినంత మాత్రాన వివాహ మూల స్వభావం మారదని పేర్కొంది. ముస్లిం పర్సనల్ లా ప్రకారం జరిగిన పెళ్లిళ్లకు షరియా చట్టమే వర్తిస్తుందని తెలిపింది. విదేశీ ప్రయాణాలు/ వీసా కోసం స్పెషల్ మ్యారేజ్ యాక్ట్ (ూఓం) కింద పెళ్లి రిజిస్టర్ చేసుకున్నంత మాత్రాన ముస్లిం పర్సనల్ లా రద్దు కాదని తేల్చి చెప్పింది.'నికాహ్' చేసుకున్న దంపతులు విడాకుల కోసం స్పెషల్ మ్యారేజ్ యాక్ట్‌ను ఆశ్రయించలేరని వెల్లడించింది. వ్యక్తిగత చట్టాల ప్రకారం జరిగిన వివాహాలకు ఆయా మతపరమైన నిబంధనలే వర్తిస్తాయని హైకోర్టు డివిజన్ బెంచ్ తెలిపింది. స్పెషల్ మ్యారేజ్ యాక్ట్ కింద విడాకులు పొందాలంటే.. వివాహం కూడా అదే చట్టం కింద జరిగి ఉండటం తప్పనిసరని పేర్కొంది.

భూపాలపల్లిలో డీజీపీ సీవీ ఆనంద్ పర్యటన

భూపాలపల్లి,ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటనలో భాగంగా భూపాలపల్లి జిల్లాకు వచ్చిన డీజీపీ సీవీ ఆనంద్ పోలీసు అధికారులతో నేరాల నియంత్రణ, సైబర్ నేరాలు, గంజాయి అక్రమ రవాణా, రోడ్డు ప్రమాదాల నివారణ, మహిళల భద్రత తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. పోలీస్ ప్రధాన కార్యాలయంలో నూతన జిమ్ సెంటర్ను ప్రారంభించి, సిబ్బంది ఆరోగ్యం, శారీరక దృఢత్వంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని తెలిపారు. అరైవ్ ఆలైవ్ కార్యక్రమంలో భాగంగా పోలీసు సిబ్బందికి హెల్మెట్లను పంపిణీ చేసి, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

పిఠాపురంలో రోడ్లకు మహర్దశ

కాకినాడ, ఆగస్టు 10, ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిఠాపురం నియోజకవర్గాన్ని దేశంలోనే ఒక ఆదర్శవంతమైన మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా నియోజకవర్గవ్యాప్తంగా పల్లెల నుంచి పట్టణాల వరకు మౌలిక వసతుల కల్పనకు, ముఖ్యంగా రహదారుల పునర్నిర్మాణానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. కేవలం రోడ్ల నిర్మాణం, మరమ్మతుల కోసమే ఏకంగా రూ. 200 కోట్లకు పైగా నిధులను వెచ్చించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, సాస్కీ, రోడ్లు భవనాల శాఖ, పంచాయతీరాజ్ శాఖల భాగస్వామ్యంతో మొత్తం 307 కిలోమీటర్ల మేర నూతన రహదారుల నిర్మాణ ప్రణాళికలు రూపొందించారు. ఇప్పటికే రూ. 100 కోట్ల అంచనా వ్యయంతో 152 కిలోమీటర్ల మేర 611 రోడ్ల నిర్మాణ పనులు విజయవంతంగా పూర్తయ్యాయి. నిర్దిష్ట లక్ష్యంలో దాదాపు 80 శాతం పనులు పూర్తి కావడంతో పిఠాపురం నియోజకవర్గంలో రవాణా వ్యవస్థ రూపురేఖలు మారిపోయి గ్రామాల్లో కొత్త కళ సంతరించుకుంది.రహదారుల నిర్మాణంలో ప్రజల, రైతులు, మత్స్యకారుల అవసరాలను ప్రాతిపదికగా తీసుకున్నారు. దశాబ్దాలుగా తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్న ఉప్పాడ తీరప్రాంత మత్స్యకారుల కోసం ప్రత్యేకంగా జెట్టీకి వెళ్లే మార్గంలో గ్రావెల్ రోడ్డును నిర్మించి వారి రవాణా కష్టాలను తీర్చారు. అంతేకాకుండా సముద్ర కోత వల్ల ఇళ్లను కోల్పోయిన మాయాపట్నం మత్స్యకారులకు సుబ్బంపేట సమీపంలో కల్పించిన కొత్త మాయాపట్నం పునరావాస కాలనీలో 13 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ రూ. 1.52 కోట్లతో 1.5 కిలోమీటర్ల సీసీ రోడ్లు, 2.8 కిలోమీటర్ల డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేశారు.కొత్తసూరాడపేట పునరావాస కాలనీకి సైతం రూ. 93 లక్షలతో 1.6 కిలోమీటర్ల సిమెంటు రోడ్లు నిర్మించి, ప్రధాన రహదారికి అనుసంధానం చేశారు. తుపాన్ల ధాటికి పూర్తిగా కొట్టుకుపోయిన యు.కొత్తపల్లి మండలంలోని అమరవిల్లి-రామన్నపాలెం బీచ్ రోడ్డును రూ. 88 లక్షలతో పునర్నిర్మించడం ద్వారా వేలాది మంది ప్రజలకు, స్థానిక బషీర్ బీబీ ఆలయ దర్శనానికి వెళ్లే భక్తులకు మార్గం సుగమమైంది.సెజ్ పరిధిలో ఉండి ఏళ్ల తరబడి అభివృద్ధికి దూరమైన ముమ్మడివారిపాడు గ్రామానికి రూ. 79.70 లక్షలతో శాశ్వత రహదారిని అందుబాటులోకి తెచ్చారు. కొత్తపల్లి గ్రామంలో ప్రజల చిరకాల కోరికైన శ్మశాన వాటిక దారిని రూ. 26.30 లక్షలతో సీసీ రోడ్డుగా మలిచారు. కొండెవరం గ్రామ పరిధిలోని పిఠాపురం-ఉప్పాడ ఆర్ అండ్ బీ రోడ్డును రూ. 1.22 కోట్ల ఉపాధి నిధులతో పవన్ కళ్యాణ్ యుద్ధప్రాతిపదికన పూర్తి చేయించారు. మరోవైపు దశాబ్దాలుగా గుంతలమయమై నరకప్రాయంగా మారిన గొల్లప్రోలు మండలం వెన్నెపూడి జీఎన్టీ ప్రధాన రహదారిని రూ. 85 లక్షలతో, గొల్లప్రోలు-తాటిపర్తి పుంత రోడ్డును రూ. 1.46 కోట్లతో పునర్నిర్మించి రైతులకు, ప్రయాణికులకు ఊరటనిచ్చారు. చిత్రాడ గ్రామంలోని ఈబీసీ కాలనీ వాసుల కోసం రూ. 3 కోట్లతో సీసీ రోడ్లు, ఆధునిక డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టడంతో పాటు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల భద్రతకై రూ. 50 లక్షలతో ప్రహరీ గోడను నిర్మించారు.వ్యవసాయ రంగ సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ 'పల్లెపండుగ 2.0' ద్వారా పంట పొలాల మధ్య ఉన్న డొంక రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పి.రాయవరం, బి. ప్రత్తిపాడు గ్రామాల్లో కోటి రూపాయలకు పైగా వెచ్చించి 3 కిలోమీటర్ల మేర నిర్మించిన గ్రావెల్ రోడ్లు దాదాపు 200 ఎకరాలకు పైగా వ్యవసాయ భూములకు మెరుగైన రవాణా సదుపాయాన్ని కల్పించాయి. అభివృద్ధి పనులపై నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం పురోగతిలో ఉన్న 70 కిలోమీటర్ల పెండింగ్ రోడ్డు పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రహదారుల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని, అధికారులు నిరంతరం పర్యవేక్షణ జరపాలని స్పష్టం చేశారు

జనాలు ఓట్లు రాలుస్తాయా.....

విజయవాడ, ఆగస్టు 10, వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి పర్యటనలు ఎప్పుడూ రాజకీయంగా చర్చనీయాంశంగానే మారుతుంటాయి. ఆయన ఎక్కడికి వెళ్లినా పెద్ద ఎత్తున ప్రజలు కనిపించడం సహజమే. గతంలో పార్టీ నాయకులు ప్రత్యేకంగా జనసమీకరణ చేపట్టేవారనే విమర్శలు వినిపించేవి. అయితే ఇప్పుడు పరిస్థితి మారిందని వైసీపీ నాయకులు చెబుతున్నారు. జగన్ పర్యటనలకు ప్రజలు స్వచ్ఛందంగా వస్తున్నారని, ఎవరినీ ప్రత్యేకంగా తీసుకురావాల్సిన అవసరం లేదని వారు వాదిస్తున్నారు. ఇటీవల శ్రీకాకుళం తూర్పుగోదావరి జిల్లాల్లో జరిగిన పర్యటనల్లో కనిపించిన జనసందోహాన్ని ఇందుకు ఉదాహరణగా చూపిస్తున్నారు.అయితే ఈ పరిస్థితిని మరో కోణంలో కూడా రాజకీయ విశ్లేషకులు పరిశీలిస్తున్నారు. పెద్ద ఎత్తున జనాలు రావడం రాజకీయంగా బలం చూపించినా, భద్రతా పరంగా మాత్రం సవాళ్లు పెంచుతుందని వారు అభిప్రాయపడుతున్నారు. భారీగా ప్రజలు చేరడం వల్ల తొక్కిసలాటలు, ఆస్తి నష్టం లేదా అనుకోని ఘటనలు జరిగే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. అలాంటి సంఘటనలు భవిష్యత్తులో రాజకీయంగానే కాకుండా చట్టపరంగానూ ఇబ్బందులు తీసుకురావచ్చని అంచనా వేస్తున్నారు.ఇటీవల తూర్పుగోదావరి జిల్లాలో జరిగిన పర్యటన సందర్భంగా ఒక మహిళకు చెందిన దుకాణం దెబ్బతినడం, పొగాకు బేళ్లపై కొందరు ఎక్కి తొక్కడం వంటి ఘటనలు చర్చకు వచ్చాయి. అలాగే శ్రీకాకుళం జిల్లాలో మహిళా ఎస్సై విధులు నిర్వహిస్తున్న సమయంలో జరిగిన తోపులాట కూడా వివాదాస్పదమైంది. ఈ సంఘటనలకు సంబంధించిన వీడియోలు, వివరాలను అధికార వర్గాలు ప్రత్యర్థి పార్టీ నాయకులు నమోదు చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.గతంలో గుంటూరు జిల్లాలో జరిగిన మరో ఘటన కూడా తరచూ ప్రస్తావనకు వస్తోంది. ఒక పార్టీ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించేందుకు జగన్ వెళ్లిన సమయంలో జరిగిన రద్దీలో మరో కార్యకర్త వాహనం కింద పడి ప్రాణాలు కోల్పోయిన సంఘటనపై కేసు నమోదైంది. ఇలాంటి సంఘటనలు రాజకీయ కార్యక్రమాల్లో భద్రత ఎంత ముఖ్యమో గుర్తు చేస్తున్నాయి.ఇదే తరహా ఘటనలు దేశంలోని ఇతర రాష్ట్రాల్లో కూడా చోటుచేసుకున్నాయి. తమిళనాడులో విజయ్ నిర్వహించిన భారీ ర్యాలీ సందర్భంగా తొక్కిసలాట జరిగి పలువురు ప్రాణాలు కోల్పోయిన విషయం దేశవ్యాప్తంగా చర్చకు వచ్చింది. అలాగే కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర సమయంలో కూడా భారీ జనసందోహం కారణంగా కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయి. బీహార్ లో ప్రశాంత్ కిశోర్ పాదయాత్ర సందర్భంగా భద్రతా సమస్యలు వెలుగులోకి వచ్చాయి.ఈ పరిణామాల నేపథ్యంలో రాజకీయ సభలు, ర్యాలీలు, పాదయాత్రల నిర్వహణలో భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే కార్యక్రమాలపై ప్రభుత్వం, పోలీసులు మరింత అప్రమత్తంగా వ్యవహరించే అవకాశముంది. భవిష్యత్తులో జగన్ చేపట్టే పాదయాత్ర లేదా ఇతర భారీ కార్యక్రమాలకు అనుమతులు, భద్రతా నిబంధనల విషయంలో మరింత కఠినమైన షరతులు విధించే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయ బలం చూపించడమే కాకుండా ప్రజల భద్రతను కాపాడటం కూడా అన్ని పార్టీల ప్రధాన బాధ్యత అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.వైసీపీలో ఇపుడు కొత్త చర్చ సాగుతోంది. పార్టీ కోసం జనంలో ఉండి పోరాడామని ఎవరు చెప్పినా దానికి అధికారిక పత్రం ఏమి ఉంటుంది అన్నదే అంతా అనుకుంటారు. అదే ఏదో విధంగా జనంలోకి వచ్చి పోరాటాలు చేస్తే ఆ మీదట ఎటూ పోలీసులు కేసు కడతారు, అలా అరెస్టు అయి జైలు పాలు అయితే అది నేరుగా అధినాయకత్వం దృష్టిలోకి వెళ్తుందని తప్పకుండా అలాంటి వారికే టికెట్ దక్కుతుందని అంటున్నారు. వైసీపీలో

ఈ అరెస్టులు జైళ్ళు ఇలా ఎంతో మంది నాయకులు గత రెండేళ్ళుగా ఎదుర్కొంటూ వచ్చారు, ఇపుడు మరింత మంది జైలులో ఉన్నారు, ఇంకొంతమంది జైలుకు వెళ్ళే బాటలో ఉన్నారని అంటున్నారు. వైసీపీ నేతలు ఎవరైనా అరెస్టు అయితే ఆ పార్టీ అధినాయకత్వం నుంచి భారీ రియాక్షన్ వస్తోంది. నేరుగా జగన్ ట్వీట్ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం మీద విమర్శలు కూడా అందులో చేస్తున్నారు. అంతే కాదు వారికి పరామర్శలు ఆ మీదట భారీ ప్రచారం వంటివి వెంటవెంటనే జరిగిపోతున్నాయి. ఇటీవల కాలంలో చూసుకుంటే శ్రీకాకుళం జిల్లాలో మాజీ మంత్రి సీదరి అప్పలరాజు అరెస్టు అయితే జగన్ పరామర్శకు జైలు దాకా వెళ్ళి వచ్చారు. ఆ తరువాత కర్నూలు జిల్లాకు చెందిన ఎమ్మెల్యే విరూపాక్షిని అరెస్టు చేశారు. ఇపుడు శ్రీకాకుళంలో ఆముదాలవలస ఇంచార్జి చింతాడ రవి కుమార్ ని అరెస్టు చేశారు. దీంతో వైసీపీ నేతలు అంతా ఆయనకు సంఘీభావం ప్రకటించారు. అధినాయకత్వం కూడా దీని మీద ఘాటుగా స్పందించింది. ఆముదాలవలస అంటే మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అందరికీ గుర్తుకు వస్తారు. అలాంటి చోట 2024 ఎన్నికల తరువాత వైసీపీ అధినాయకత్వం చేసిన మార్పులలో భాగంగా యువ నేత అయిన చింతాడ రవికుమార్ కి ఇంచార్జి బాధ్యతలు అప్పగించింది. ఆయన నాటి నుంచి పార్టీని యాక్టివ్ గా చేస్తున్నారు. జగన్ తాజా శ్రీకాకుళం పర్యటనలో ఆయన భారీ జనాలతో తరలి వచ్చారు. ఈ సందర్భంగానే మహిళా ఎస్సైతో జరిగిన గొడవలో ఆయనను అరెస్టు చేశారు. ఇక ఇపుడు ఆయనకు ఆముదలవలస టికెట్ ఖరారు అయినట్లే అని అంటున్నారు. మరో వైపు భూ కబ్జా ఆరోపణల మీద మాజీ స్పీకర్ కుటుంబం ఇబ్బందులు పడుతోంది. దాంతో కూడా చింతాడ రవి కుమార్ కి కలసి వచ్చింది అని అంటున్నారు.

రాష్ట్రంలో కొత్త జిల్లా పరిషత్‌లు

విశాఖపట్టణం, ఆగస్టు 10,కొత్త జిల్లా పరిషత్‌లను ఏర్పాటు చేసేందుకు ఏపీ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. కొత్తగా ఏర్పాటు చేసిన జిల్లాలలో కొత్త జిల్లా పరిషత్‌లు ఏర్పాటు చేసే ఆలోచనలో ఉంది. ప్రస్తుత జిల్లా పరిషత్‌ల పదవీకాలం ఈ నెలాఖరుతో ముగియనుంది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే కొత్త జిల్లా పరిషత్‌లు ఏర్పాటు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో కొత్త జిల్లా పరిషత్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ఈ నెలాఖరు నాటికి ప్రస్తుత జిల్లాపరిషత్ సభ్యుల పదవీకాలం పూర్తి కానుంది. ఈ నేపథ్యంలో పదవీకాలం పూర్తి అయిన తర్వాత కొత్త జిల్లాపరిషత్‌లు ఏర్పాటు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. కొత్త జిల్లా పరిషత్‌ల ఏర్పాటుపై రాష్ట్రంలోని అన్ని జిల్లా పరిషత్ సీఈవోలతో ప్రభుత్వం సమావేశం కానుంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే, రాబోయే నెలల్లో కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో కొత్త జిల్లా పరిషత్‌లను ఏర్పాటు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది. వైసీపీ ప్రభుత్వం జిల్లా పరిషత్ ఎన్నికల తర్వాత, 2022 ఏప్రిల్‌లో కొత్త జిల్లాలను ఏర్పాటు చేసింది. అయితే, పరిపాలనాపరమైన ఇబ్బందులను నివారించడానికి, అప్పటికే ఎన్నికైన జిల్లా పరిషత్ మండళ్లు.. ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన తమ కార్యకలాపాలను కొనసాగించాయి. కొత్తగా ఏర్పడిన జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులు ఇప్పటికీ ఉమ్మడి జిల్లా పరిషత్ సమావేశాలకు హాజరవుతున్నారు.మరోవైపు కొత్త జిల్లాల కోసం ప్రత్యేక జిల్లా పరిషత్‌లను ఏర్పాటు చేసి, వాటికి ప్రత్యేక కార్యాలయ భవనాలను సమకూర్చాలని ప్రస్తుత ప్రభుత్వం ఆలోచిస్తోంది. విశాఖపట్నం జిల్లా పరిషత్ మూడు జిల్లా పరిషత్‌లుగా.. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజుగా విభజించనున్నారు. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో కొత్త జిల్లా పరిషత్ కార్యాలయాలను ఏర్పాటు చేయనున్నారు. విశాఖపట్నం జిల్లా పరిషత్ కార్యాలయం మాత్రం ప్రస్తుతం ఉన్న భవనం నుంచే తన కార్యకలాపాలను కొనసాగిస్తుంది.విశాఖపట్నం జిల్లా పరిషత్‌కు చెందిన ఓ సీనియర్ అధికారి వెల్లడించిన వివరాల ప్రకారం.. ప్రస్తుతం ఉన్న ఉద్యోగులలో సుమారు 60 శాతం మందిని 24 మండలాలు కలిగిన అనకాపల్లి జిల్లాకు, 30 శాతం మందిని 11 మండలాలు కలిగిన అల్లూరి సీతారామరాజు జిల్లాకు కేటాయించే అవకాశాలు ఉన్నాయి. మిగిలిన 10 శాతం మందిని కేవలం నాలుగు మండలాలు మాత్రమే ఉన్న విశాఖపట్నం జిల్లాకు కేటాయించే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు అనకాపల్లి , అల్లూరి సీతారామరాజు జిల్లాల యంత్రాంగాలు ఇప్పటికే కొత్త జిల్లా పరిషత్ కార్యాలయాల కోసం తగిన భవనాలను, స్థలాలను గుర్తించాయి.మంత్రులు మౌనంగా ఉంటే సహించేది లేదని సీఎం చంద్రబాబు తేల్చి చెప్పారు. ముఖ్యంగా టీడీపీ మంత్రులకు ఆయన ఈ విషయంలో ఇప్పటికే చాలా సార్లు హెచ్చరికలు జారీ చేశారు. అయినప్పటికీ చాలా మంది మంత్రులు మౌనంగా ఉండడం.. కనీసం పన్నెత్తు విమర్శ కూడా చేయకపోవడంతో సీఎం మరోసారి వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఉదయమే టెలీ కాన్ఫరెన్సు నిర్వహించిన సీఎం చంద్రబాబు.. మంత్రులకు వారి బాధ్యతలను గుర్తు చేసినట్టు తెలిసింది.ఫైళ్ల క్లియరెన్సు, శాఖలపై పట్టు విషయంలో రెండున్నరేళ్లు అవుతున్నా.. ఇప్పటికీ ఐదుగురు టీడీపీ మంత్రులు పట్టు పెంచుకోలేక పోయారని చంద్రబాబు తేల్చి చెప్పారు. ఇక, ప్రత్యర్థులు చేస్తున్న దాడిని ఎదుర్కొనడంలో దాదాపు సగం మంది మౌనంగానే ఉంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఇంకా.. ప్రతి విషయాన్నీ తాను చెప్పాలంటే కుదరదని.. ఇక నుంచి అయినా.. మిషన్ మోడ్‌తో పనిచేయాలని సూచించారు. ప్రత్యర్థులు రెచ్చిపోతున్నా.. మంత్రులు ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించారు.ఇక, స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మంత్రులకు బాధ్యతలు ఎక్కువగా ఉంటాయని చంద్రబాబు పేర్కొన్నారు. ఒక్క చోట కూడా.. కూటమి పార్టీలు ఓటమి చవి చూడకూడదని స్పష్టం చేశారు. ఎవరూ అలసత్వం ప్రదర్శించవద్దన్నారు. అదే సమయంలో మీడియా ముందుకు రావడం.. ప్రజలకు మంచిని వివరించడం చేయాలని చెప్పారు. ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నా.. దాని తాలూకు ఫలితం ఓట్ల రూపంలో మారకపోతే.. ఎలాంటి ప్రయోజనం ఉండదని స్పష్టం చేశారు.తానే స్వయంగా మంత్రుల పనితీరును పరిశీలించనున్నట్టు సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. జిల్లాల ఇంచార్జ్ మంత్రులు.. అసలు జిల్లాల్లో పర్యటించడం లేదని తనకు నివేదికలు అందాయన్నారు. ముఖ్యంగా అంతర్గత పోరును తగ్గించాలని చెబుతున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ఇది సరికాదన్న ఆయన 'పనితీరు మెరుగు పరుచుకోని వారు.. ఆలోచన చేసుకోవాలి" అని పరోక్షంగా హెచ్చరించారు. వచ్చే స్థానిక ఎన్నికల తర్వాత.. ఫలితాన్ని బట్టి మార్పులు ఉండే అవకాశం ఉందని ఆయన పరోక్షంగా మంత్రి వర్గ ప్రక్షాళనపై సంకేతాలు ఇచ్చేశారు.

జనసేన పవర్ ఫుల్ ప్లాన్

విజయవాడ, ఆగస్టు 10, జనసేన అధినేత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సైలెంట్ గా తన పని తాను చేసుకుని పోతున్నారు. ఒక వైపు పార్టీ అధినేతగా జనసేనను సంస్థాగతంగా బలోపేతం చేసే కార్యక్రమాలు చేస్తున్నారు. మరో వైపు ఉప ముఖ్యమంత్రిగా తన దగ్గర ఉన్న ప్రాధాన్యత కలిగిన శాఖలను పూర్తిగా అవగాహన చేసుకుని వాటి పనితీరులో మెరుగుదల చూపిస్తున్నారు. అటవీ శాఖ ద్వారా గిరిజన ప్రాంతాలలో రోడ్లు వేయించి అడవి తల్లి బాట పేరుతో వారికి దారి చూపిస్తున్నారు. అలాగే పంచాయతీ రాజ్ శాఖ ద్వారా గ్రామీణ ప్రాంతాలలో అభివృద్ధి కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపడుతున్నారు. పనిలో పనిగా పర్యావరణ శాఖ మీద కూడా ఆయన దృష్టి పెట్టారు. ఇటీవల అనకాపల్లి జిల్లాలో ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం అయిన పంచదార్ల వద్ద అక్రమ మైనింగ్ జరుగుతోందని తెలిసి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నో మైనింగ్ జోన్ గా ప్రకటించాలని కూడా సూచించారు.ఇక పార్టీ పరంగా చూస్తే పవన్ కళ్యాణ్ బూత్ లెవెల్ నుంచి జనసేనను పటిష్టం చేసే కార్యక్రమం ముమ్మరం చేశారు.

రైతుల పంట విరామం

ఏలూరు, ఆగస్టు 10, ఆరుగాలం శ్రమించిన పంట చేతికి అందుతుందన్న దశలో ప్రకృతి వైపరీత్యాల బారినపడి ఖరీఫ్ పంట నాశనం అవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికంతటికి మురుగు కాలువల ఆక్రమణ, విచ్చలవిడిగా ఆక్వా వ్యర్థాలు వంట కాలువల్లోనూ వదులుతుండటం కారణమని రైతులు వాపోతున్నారు. జూలై నెలాఖరు వరకు సక్రమంగా సాగునీరు అందని పరిస్థితి ఉందని చెబుతున్నారు. ఇలా అనేక కారణాలు తీవ్ర ఇబ్బందులు గురిచేస్తున్నాయని, ఈ క్రమంలోనే సాగు చేయలేమంటూ రైతులు విరమణ ప్రకటించారు అల్లవరం మండలం తాడికోన గ్రామంలో వరి రైతులు. ఊడ్చని చేలు వద్ద పంట విరామం ప్రకటిస్తున్నట్లు ఫ్లెక్సీ ఏర్పాటు చేయడంతో చర్చకు దారితీసింది. ఈ క్రమంలోనే తాడికోన గ్రామంలో ఎవ్వరు ఊడ్చేది లేదని రైతులు తేల్చి చెప్పారు. డ్రెయిన్ల ఆక్రమణపై ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన కనీసం స్పందించడం లేదని అన్నారు. దీంతో చిన్నపాటి వర్షాలకి పంట పొలాలు ముంపు గురై పంట నాశనం అవుతుందని వాపోతున్నారు. పెట్టిన పెట్టుబడులు దక్కక అప్పుల పాలవుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క విచ్చలవిడిగా ఆక్వా చెరువులు తవ్వి అక్రమ సాగు చేస్తున్న తీరుపై ఫిర్యాదులు చేస్తున్న కనీస చర్యలు తీసుకోవడం లేదంటూ రైతులు మండిపడ్డారు. ఈ పరిస్థితుల్లో పంట విరామం ప్రకటిస్తున్నట్లు తాడికోన రైతులు వెల్లడించారు.అల్లవరం మండలం బెండమూర్లంకలో చారిత్రాత్మకమైన మొదటి పంట విరామ ఉద్యమం 2011లో రైతులు ప్రకటించారు. రైతులకు గిట్టుబాటు ధర లభించకపోవడం, పెట్టుబడి వ్యయం పెరిగిపోవడం, డ్రెయినేజీ సమస్యల వల్ల బెండమూర్లంక రైతులు తొలిసారిగా ఈ విసూత్న ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. ఈ ఉద్యమ ప్రభావం అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనమైంది. దీంతో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం మోహన్ కందా కమిటీ వేసి క్షేత్రస్థాయిలో రైతులు పడుతున్న ఇబ్బందులపై విచారణ చేపట్టించారు. ఇదే తరహాలో కాలువల ఆధునికీకరణ, ధాన్యం బకాయిల ఆలస్యంపై నిరసనగా మళ్లీ 2022 ఖరీఫ్ సీజన్‌లో బెండమూర్లంకతోపాటు అల్లవరం మండలంలోని పలు గ్రామాల్లోని రైతులు పంట విరామం ప్రకటించారు. మళ్ళీ ఇప్పుడు ఇదే మండలంలోని తాడికోన గ్రామం నుంచి పంట విరామం ఉద్యమం ప్రారంభించారు.

100 శాతం టెలికాం కనెక్టివిటీ

విజయవాడ, ఆగస్టు 10, ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా కమ్యూనికేషన్ రంగాన్ని పూర్తిస్థాయిలో బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకమైన అడుగులు వేస్తోంది. రాష్ట్రంలోని ప్రతీ మారుమూల గ్రామానికి, గిరిజన ప్రాంతాలకు సైతం నెట్‌వర్క్ సౌకర్యాన్ని చేర్చడం ద్వారా 100 శాతం టెలికాం కనెక్టివిటీని సాధించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా టెలికాం ఆపరేటర్లను మరియు టవర్ల ఏర్పాటును ప్రోత్సహించేందుకు ఎన్నడూ లేని విధంగా భారీ రాయితీలను, సరికొత్త రాయితీ విధానాన్ని ప్రభుత్వం తెరపైకి తీసుకువచ్చింది.ఈ మెగా ప్రాజెక్టును వేగవంతం చేసేందుకు మొబైల్ టవర్ల ఏర్పాటుకు ఎలాంటి అద్దె లేకుండా ఉచితంగా ప్రభుత్వ భూములను కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనితో పాటు సదరు టెలికాం టవర్లకు అత్యంత తక్కువ ధరకే రాయితీపై విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖను ఆదేశించింది. టెలికాం ఆపరేటర్ల నుండి వచ్చే ప్రతిపాదనలను ఎప్పటికప్పుడు వేగంగా పరిశీలించి, ఎక్కడా జాప్యం లేకుండా టవర్ల ఏర్పాటుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి.రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో టవర్ల ఏర్పాటుకు అవసరమైన ప్రభుత్వ భూములను తక్షణమే గుర్తించి కేటాయించాల్సిందిగా వివిధ శాఖల ప్రభుత్వ కార్యదర్శులను ఐటీ శాఖ కోరింది. అలాగే క్షేత్రస్థాయిలో ఈ భూముల కేటాయింపు ప్రక్రియ వేగంగా పూర్తయ్యేలా ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రత్యేకంగా సహకరించాలని రాష్ట్ర ఐటీ రక్షణ శాఖ స్పష్టం చేసింది. డిజిటల్ ఆంధ్రప్రదేశ్ దిశగా ప్రభుత్వం తీసుకున్న ఈ చారిత్రాత్మక నిర్ణయం వల్ల రాష్ట్రంలో ఇంటర్నెట్, మొబైల్ సిగ్నల్స్ లేని ప్రాంతమంటూ లేకుండా పోతుందని, దీనివల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరియు డిజిటల్ సేవలు మరింత విస్తరిస్తాయని నిపుణులు భావిస్తున్నారు.

ఉలవపాడులో పునాస మామిడికి డిమాండ్

ఒంగోలు, ఆగస్టు 10, ఏపీలో ఉలవపాడు మామిడి రైతుల పంట పండింది. ఈ సీజన్‌లో దొరికే పునాస రకం మామిడితో భారీ లాభాలు అందుకుంటున్నారు. ఈసారి కేజీ కాయలు రూ.50 వరకు పలుకుతున్నాయి.. దీంతో రైతులు ఆనందంలో ఉన్నారు. ఈ నెలలో ఓనం పండగ కూడా ఉండటంతో మామిడి కాయలకు ఇంకా మంచి ధర వస్తుందని రైతులు ఆశిస్తున్నారు. ఈ ఏడాది కాస్త లాభాలు వస్తాయని చెబుతున్నారు.ఆంధ్రప్రదేశ్‌లో ప్రకాశం జిల్లా ఉలవపాడు మామిడి కాయలు బాగా ఫేమస్. బంగినపల్లి, రసాలు సహా పలు రకాల మామిడి కాయలు సీజన్‌లో దొరుకుతాయి. మార్చి నెలలో సీజన్ మొదలైతే.. జూన్ వరకు కొనసాగుతుంది. ప్రతి ఏటా సీజన్ ముగిశాక కూడా మామిడి రైతులు పునాస రకం కాయల ద్వారా ఆదాయం పొందుతున్నారు. కొన్నేళ్లుగా పునాస కాయలకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతులు ఆందోళనలో ఉన్నారు. ఈ ఏడాది మాత్రం అలా కాదు.. పునాస కాయల ధరలు దుమ్ము రేపుతున్నాయి.. భారీగా లాభాలు వచ్చే అవకాశం ఉందంటున్నారు.ప్రకాశం జిల్లా గుడ్లూరు, ఉలవపాడు మండలాలు సహా అన్ని చోట్లా కలిపి పునాస మామిడిని ఐదువేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ప్రధానంగా బంగినపల్లి, రసాలు, బెంగళూరు రకం కాయల సీజన్ తర్వాత.. జులై, ఆగస్టు నెలల్లో పునాస పంట చేతికి వస్తుంది. నాలుగైదు రోజులుగా ఈ పునాస రకం మామిడి కాయలకు మార్కెట్‌లో గిరాకీ పెరిగింది. కేజీ రూ.50 వరకు పలుకుతోంది.. టన్ను రూ.50వేల వరకు ఉంది. గుడ్లూరు మండలంలో ప్రతి రోజూ నాలుగు టన్నుల వరకు కాయలు చెన్నై, బెంగళూరు సహా ఇతర ప్రాంతాలకు ఎగుమతి అవుతున్నాయి. ఉలవపాడుకు ఈ కాయల్ని తీసుకొచ్చి ఇతర రాష్ట్రాలకు లారీల ద్వారా పంపిస్తున్నారు.ఈ పునాస మామిడి కాయలు కేరళంలో నిర్వహించే ఓనం వండగకు వినియోగిస్తుంటారు. అందుకే కేరళం రాష్ట్రానికి ఎగుమతులు ఎక్కువగా పునాస కాయల్ని ఎగుమతి చేస్తుంటారు. ఆగస్టు నెలాఖరులో ఈ పండగ ఉండటంతో.. కాయల ధర మరింత పెరిగే అవకాశం ఉందని, లాభాలు వస్తాయని రైతులు ఆనందంలో ఉన్నారు. ఈ ఏడాది బంగినపల్లి దిగుబడి బావుంది.. కానీ ధరలు మాత్రం లేవు. సీజన్ ముగిసే సమయంలో టన్ను రూ.60వేలు కూడా పలకలేదు. దీంతో రైతులు పెట్టుబడులు కూడా రాలేదని నిరాశ చెందారు.

స్పోర్ట్స్ న్యూస్

రెస్టారెంట్‌లో భారత మ్యాప్‌పై లవ్లీనా అభ్యంతరం.. ఆమె చర్యను ప్రశంసించిన మోదీ

కామన్వెల్త్ గేమ్స్ 2026 సందర్భంగా భారత మ్యాప్‌ను తప్పుగా ముద్రించడంపై అభ్యంతరం వ్యక్తం చేసిన బాక్సర్ లవ్లీనా బోర్గోహెయిన్‌ను ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు. గ్లాస్గోలోని ఓ రెస్టారెంట్‌లో జాతీయ పతాకంలో ఈశాన్య రాష్ట్రాలు కనిపించకపోవడాన్ని గమించిన లవ్లీనా.. వెంటనే సిబ్బందికి చెప్పి సరి చేయించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనను ప్రస్తావించిన మోదీ.. దేశం పట్ల ఆమెకున్న గౌరవాన్ని అభినందించారు. కామన్వెల్త్ గేమ్స్‌లో పతకాలు సాధించిన భారత అథ్లెట్లతో ప్రధాని మోదీ తన నివాసంలో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ కార్యక్రమంలో కేంద్ర క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవీయ, సహాయ మంత్రి రక్షా ఖడ్సే, భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉష తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లవ్లీనాను ఉద్దేశించి మోదీ సరదాగా.. 'ఏమైంది? రెస్టారెంట్ వాళ్లతో గొడవ పడుతున్నారట?' అని అడిగారు. దీనికి ఆమె నవ్వుతూ.. 'సర్.. కామన్వెల్త్ గేమ్స్‌లో మేం చాలా బాగా ఆడాం. చివరి రోజు కావడంతో అందరం సంతోషంగా వేడుక చేసుకుంటున్నాం. అక్కడ జాతీయ పతాకాన్ని



తప్పుగా ముద్రించి అక్కడ పెట్టారు. అది నాకు నచ్చలేదు. అందుకే రెస్టారెంట్ సిబ్బందికి మర్యాదగా చెప్పాను. వాళ్లు కూడా వెంటనే దాన్ని సరిచేశారు' అని వివరించింది. కాగా లవ్లీనా చర్యను మోదీ అభినందించారు. 'గేమ్స్ పూర్తయ్యాయి. మీరు విజయాన్ని సెలబ్రేట్ చేసుకుంటున్న సమయంలో కూడా ఆ మ్యాప్ ప్రాముఖ్యాన్ని గుర్తించడం గొప్ప విషయం. గెలుపు సంబరాల్లోనూ దేశ ప్రతిష్ఠను గుర్తించి అభ్యంతరం వ్యక్తం చేయడం సామాన్యమైన విషయం కాదు. చాలా కాలం పాటు ప్రజలు దాన్ని గుర్తుంచుకుంటారు' అని ప్రశంసించారు.వెయిట్ లిఫ్టర్ మీరాబాయి చానుతో మోదీ ప్రత్యేకంగా మాట్లాడారు. బంగారు పతకం అందుకున్న సమయంలో కన్నీళ్లు పెట్టుకోవడంపై మోదీ ఆరా తీశారు. అంతేకాదు.. ఆమెకు స్వయంగా లడ్డూ తినిపించడం విశేషం. 'కన్నీళ్లు ఎందుకొచ్చాయి?' అని మోదీ ప్రశ్నించారు. 'ఆ క్షణంలో చాలా సంతోషంగా, భావోద్వేగంగా అనిపించింది. పారిస్ ఒలింపిక్స్‌లో కేవలం కిలో తేడాతో పతకం కోల్పోయాను. ఆ తర్వాత నాలుగేళ్లలో గాయాలతో పాటు కుటుంబ సమస్యలను ఎదుర్కొన్నాను. ఆ నాలుగేళ్లు నాకు చాలా కఠినంగా గడిచాయి. గ్లాస్గోలో పతక వేదికపై నిలబడి.. మన జాతీయ పతాకం రెపరెపలాడుతూ.. జాతీయ గీతం వినిపించినప్పుడు కన్నీళ్లను ఆపుకోలేకపోయాను' అని మీరాబాయి వివరించింది.

జట్టు నుంచి పిలుపు రాకపోయినా ప్రయత్నాలు ఆపొద్దు.. షమీకి జహీర్ ఖాన్ సూచన

భారత సీనియర్ పేసర్ మహ్మద్ షమీ భవిష్యత్తుపై మాజీ క్రికెటర్ జహీర్ ఖాన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ప్రస్తుతం భారత సెలెక్టర్ల ఆలోచనల్లో షమీకి చోటు కనిపించడం లేదని.. అయినప్పటికీ అతడు తన ప్రయత్నాలను ఆపొద్దని సూచించాడు. 2027 వన్డే ప్రపంచ కప్‌ను దృష్టిలో పెట్టుకుని భారత జట్టు ఇప్పటి నుంచే సన్నద్ధమవుతోంది. మరోవైపు స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా గాయాలతో ఇబ్బందులు ఎదుర్కొంటుండటంతో అతడి స్థానాన్ని భర్తీ చేసే ప్రత్యామ్నాయాలపై సెలెక్టర్లు దృష్టి సారించారు. అయినప్పటికీ షమీ పేరు మాత్రం ఎంపిక సమావేశాల్లో పెద్దగా చర్చకు రావడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో జహీర్ ఖాన్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.'షమీ మ్యాచ్‌లు ఆడుతూ అత్యుత్తమ ప్రదర్శన కొనసాగిస్తే జాతీయ జట్టు నుంచి ఎప్పుడైనా పిలుపు అందే అవకాశం ఉంటుంది. జట్టులో ఎంపిక చేయాలా? వద్దా? అనేది పూర్తిగా సెలెక్టర్ల నిర్ణయం. అయితే ఒక ప్లేయర్‌గా తన చేతుల్లో ఉన్న పనిని పూర్తి చేయాలి. మీరు ఎలా ముందుకు వెళ్లాలనుకుంటున్నారనేది మీ నిర్ణయం. మ్యాచ్‌లు ఆడుతూ బాగా రాణిస్తే జట్టు ఎంపికకు అందుబాటులో ఉంటారు. జట్టు ఆలోచన ఒకలా ఉండొచ్చు. కానీ ఆటగాడిగా మీ ఆలోచన కూడా ముఖ్యమే. జట్టుకు సేవ చేయాలనుకుంటే మీరు ఆ దిశగా ప్రయత్నించాలి. షమీ ప్రస్తుతం అదే చేస్తున్నాడు. అతడు



మ్యాచ్‌లు ఆడుతున్నాడు. వికెట్లు పడగొడుతున్నాడు. అత్యుత్తమంగా రాణిస్తున్నాడు. ఇప్పుడు అతడికి అది చాలా ముఖ్యం' అని జహీర్ ఖాన్ పేర్కొన్నాడు.భారత జట్టులో వరుసగా చోటు చేసుకుంటున్న గాయాలపైనా జహీర్ ఖాన్ స్పందించాడు. బుమ్రాతో పాటు వాషింగ్టన్ సుందర్, సాయి సుదర్శన్, రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్య తదితర ప్లేయర్లు ఫిట్‌నెస్ సమస్యలు ఎదుర్కొంటున్న విషయాన్ని ప్రస్తావించాడు. 'గాయాలు ప్రతి ఆటగాడి ప్రయాణంలో భాగమే. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ గురించి మాట్లాడుకోవచ్చు. అయితే గాయాలు సంభవించే సమయాన్ని కూడా అర్థం చేసుకోవాలి. పరిస్థితులకు అనుగుణంగా ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలి. ముఖ్యంగా పేసర్ గాయపడినప్పుడు లేదా కష్టమైన దశను ఎదుర్కొంటున్నప్పుడు మన నియంత్రణలో ఉన్న అంశాలపై దృష్టి పెట్టాలి. గాయానికి అసలు కారణం ఏంటో తెలుసుకునే వరకు ముందుకు వెళ్లడం కష్టం' అని జహీర్ ఖాన్ తెలిపాడు.

బుమ్రా కాదు.. ఆ స్టార్ ప్లేయర్ గాయాలపై వీవీఎస్ లక్ష్మణ్ కీలక వ్యాఖ్యలు

టీమిండియా యువ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి వరుస గాయాలపై బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(సీఓఈ) హెడ్, మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ స్పందించాడు. ఆల్‌రౌండర్‌గా నితీశ్‌పై అధికంగా ఉండే వర్క్‌లోడ్‌ను ఎలా సమర్థంగా నిర్వహించాలో అతడితో చర్చిస్తున్నామని చెప్పాడు. గాయాలు ఆటలో భాగమేనని, అయితే వాటి నుంచి త్వరగా కోలుకునేందుకు ఆటగాళ్లు తమ ఫిట్‌నెస్‌ను మెరుగ్గా నిర్వహించుకోవాలని సూచించాడు. ఇటీవల పలువురు భారత ఆటగాళ్లు గాయాలతో ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా సీఓఈని సందర్శించారు. అక్కడ కొనసాగుతున్న రిహాబిలిటేషన్, ఇంజూరీ మేనేజ్‌మెంట్‌ను సమీక్షించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో లక్ష్మణ్ నితీశ్ విషయంలో సీఓఈ అనుసరిస్తున్న విధానాన్ని వివరించాడు.నితీశ్ ఇటీవల తొడ కండరాల గాయానికి గురయ్యాడు. దీంతో ఐర్లాండ్, ఇంగ్లండ్, జింబాబ్వే సిరీస్‌లకు అతడు దూరమైన సంగతి తెలిసిందే. 'ఆల్‌రౌండర్‌గా నితీశ్‌పై ఎక్కువ వర్క్‌లోడ్ ఉంటుంది. మ్యాచ్‌లు ఆడుతున్న సమయంలోనే కాకుండా, జట్టులో లేని విరామ సమయాల్లోనూ ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టాలి. గాయాలు ఆటలో భాగమే. అయితే ఆల్‌రౌండర్‌గా తనపై ఉన్న భారాన్ని ఎలా సమర్థంగా నిర్వహించుకోవాలో అతడు తెలుసుకోవాలి. ప్రస్తుతం క్రికెట్‌లో ప్లేయర్లకు పెద్దగా ఆఫ్-సీజన్ ఉండటం లేదు. ఐపీఎల్, రాష్ట్ర జట్టు తరఫున క్రికెట్ ఆడటం, దేశవాళీ టోర్నీలు, అంతర్జాతీయ మ్యాచ్‌లతో ఆటగాళ్లు బిజీగా ఉంటున్నారు. అందువల్ల మ్యాచ్‌ల మధ్య లభించే స్వల్ప విరామాలను ఫిట్‌నెస్ మెరుగుపర్చుకునేందుకు సమర్థంగా వినియోగించుకోవాలి' అని లక్ష్మణ్ సూచించాడు.సీజన్ ప్రారంభానికి ముందు కాంట్రాక్ట్ ఆటగాళ్లతో పాటు భవిష్యత్తులో జట్టుకు ఎంపికయ్యే క్రికెటర్లకు పలు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు లక్ష్మణ్ తెలిపాడు. నేషనల్ ఫిట్‌నెస్ టెస్టింగ్ క్రైటీరియా (ఔఈఅ)లో భాగంగా వివిధ పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పాడు. తాజాగా టీమిండియా స్ట్రెంత్, కండిషనింగ్ కోచ్ అడ్రియన్ లె రూక్స్ సూచనతో 'బ్రోంకో టెస్ట్'ను కూడా ప్రవేశపెట్టినట్లు వెల్లడించాడు. అయితే సిరీస్ జరుగుతున్న సమయంలో యో-యో టెస్ట్ నిర్వహించడం సాధ్యం కాదని లక్ష్మణ్ స్పష్టం చేశాడు. యో-యో టెస్ట్ ఆటగాళ్ల శరీరంపై తీవ్ర ప్రభావం చూపడంతో పాటు కోలుకోవడానికి ఎక్కువ సమయం పడుతుందని వివరించాడు. దీనికి బదులుగా బ్రోంకో టెస్ట్‌ను కండిషనింగ్ సెషన్‌గా ఉపయోగించవచ్చని, తద్వారా ఆటగాళ్ల ఫిట్‌నెస్ స్థాయిలను కూడా అంచనా వేయొచ్చని చెప్పాడు. నితీశ్ విషయంలోనే కాకుండా అన్ని ఆటగాళ్ల విషయంలోనూ వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌పై సీఓఈ దృష్టి పెడుతోందని లక్ష్మణ్ స్పష్టం చేశాడు.



ఫిట్‌నెస్ కోసం 17 కిలోలు తగ్గాడు.. సర్ఫరాజ్ ఖాన్ ఈసారైనా నిరూపించుకుంటాడా?



భారత టెస్టు జట్టులోకి సర్ఫరాజ్ ఖాన్ రెండేళ్ల తర్వాత తిరిగి వచ్చాడు. శ్రీలంకతో ఆగస్టు 15 నుంచి ప్రారంభం కానున్న రెండు టెస్టుల సిరీస్‌కు టీమ్ మేనేజ్‌మెంట్ అతడిని ఎంపిక చేసింది. స్టార్ ఓపెనర్ సాయి సుదర్శన్ గాయం కారణంగా జట్టుకు దూరం కావడంతో సర్ఫరాజ్ ఖాన్‌కు అవకాశం దక్కింది. అయితే జట్టులో స్థానం కోల్పోయిన అతడు.. రీఎంట్రీ ఇవ్వడం వెనుక ఎంతో కఠోర శ్రమనే ఉంది. ఏడాదిన్నరగా కశ్మీర్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకుంటూ.. ఏకంగా 17 కిలోల బరువు తగ్గాడు. అనూహ్యంగా జట్టులో చోటు సంపాదించుకున్న సర్ఫరాజ్.. ఈసారైనా నిరూపించుకుంటాడా? అనేది చూడాల్సి ఉంది.ముంబైలో వర్షాల కారణంగా సరిగ్గా సాధన చేసే అవకాశం లేకపోవడంతో సర్ఫరాజ్ కశ్మీర్‌కు వెళ్లాడు. అక్కడ నెట్ బౌలర్లు, రాష్ట్ర జట్టు ఆటగాళ్లతో కలిసి గంటల తరబడి బ్యాటింగ్ సాధన చేశాడు. అంతేకాకుండా ముంబైలోని ఎంసీఏ ఇండోర్ సదుపాయంలో ఆస్ట్రోటర్ఫ్‌పై స్కిల్స్ ట్రైనింగ్ తీసుకున్నాడు. కుర్లాలోని ఎర్ర మట్టి పిచ్‌లపై స్పిన్‌ను ఎదుర్కొంటూ ప్రత్యేకంగా సాధన చేశాడు. ఐపీఎల్ తర్వాత ముంబై టీ20 లీగ్‌లోనూ సర్ఫరాజ్ ఆకట్టుకునే ఇన్నింగ్స్‌లు ఆడాడు. దీంతో తన ఆటను మెరుగుపరుచుకోవడంతో పాటు.. స్పిన్ బౌలింగ్‌ను ఎదుర్కొనేందుకు ప్రత్యేకంగా సిద్ధమయ్యాడు.సాయి సుదర్శన్ గాయం ఇంకా పూర్తిగా తగ్గకపోవడంతో సెలక్టర్ల ముందు సర్ఫరాజ్, రుతురాజ్ గైక్వాడ్, షేక్ రషీద్ పేర్లు ఉన్నాయి. వీరిలో స్పిన్‌ను సమర్థంగా ఎదుర్కొనే విషయంలో సర్ఫరాజ్ సరైన ఎంపికగా భావించారు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్ తర్వాత ప్రస్తుత భారత జట్టులో స్పిన్‌ను అత్యుత్తమంగా ఆడగల బ్యాటర్లలో సర్ఫరాజ్ ఒకడని జట్టు వర్గాలు భావిస్తున్నాయి. మరోవైపు ధ్రువ్ జురెల్ స్పిన్‌ను ఎదుర్కొనే విషయంలో ఇబ్బందులు పడుతున్నాడు. సర్ఫరాజ్‌కు స్వీప్‌తో పాటు రివర్స్ స్వీప్ ఆడే సామర్థ్యం ఉండటంతో శ్రీలంక స్పిన్ పిచ్‌లపై అతడు కీలకంగా మారే అవకాశం ఉంది. ప్రస్తుతం తిరిగి జట్టులో చోటు దక్కించుకున్న సర్ఫరాజ్.. శ్రీలంక స్పిన్నర్ ప్రభాత్ జయసూర్య తదితరులను ఎదుర్కొని తనను తాను నిరూపించుకోవాల్సి ఉంది.

2027 వన్డే ప్రపంచకప్.. జట్టులో చేరేందుకు సిద్ధంగా ఉన్నా: భువనేశ్వర్ కుమార్



భారత సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్ మరోసారి వార్తల్లో నిలిచాడు. 2027 వన్డే ప్రపంచ కప్ నేపథ్యంలో భువీని టీమిండియాలోకి తిరిగి తీసుకోవాలన్న డిమాండ్లు వినిపిస్తోన్న సంగతి తెలిసిందే. ఇటీవల ఐపీఎల్ 2026లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున అద్భుత ప్రదర్శన చేసిన భువీ.. 28 వికెట్లు పడగొట్టి వరుసగా జట్టు రెండోసారి టైటిల్ సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. ప్రస్తుతం భారత పేసర్లను గాయాల సమస్య వేధిస్తుండటంతో భువీని జట్టులోకి తీసుకోవాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆగస్టు 14 నుంచి జరగనున్న యూపీ టీ20 లీగ్‌లో భువీ లఖ్‌నవూ ఫాల్కన్స్ జట్టుకు నాయకత్వం వహిస్తున్నాడు. ఈ లీగ్‌కు ముందు భువీ మాట్లాడుతూ.. 2027 వన్డే ప్రపంచ కప్‌లో ఆడే అవకాశంపై స్పందించాడు.'జాతీయ జట్టు నుంచి పిలుపు వస్తే ఎందుకు వద్దంటాను? భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించేందుకు ఎప్పుడూ సిద్ధమే. అయితే ఎంతమేర సిద్ధంగా ఉన్నానో కచ్చితంగా చెప్పలేను. నా పని క్రికెట్ ఆడటమే. అందుకే యూపీ టీ20 లీగ్‌లో ఆడేందుకు వచ్చా. మరో స్థాయికి వెళ్లాలనే ఉద్దేశంతో ఇక్కడి రాలేదు. ఐపీఎల్‌లోనూ జట్టు కోసం పరుగులు, వికెట్లు సాధించి మ్యాచ్‌లు గెలిపించాలనే ఉద్దేశంతోనే ఆడాను. ఎవరో ఏదో చెప్పారనో.. ఇంకా వేరే కారణాలతోనో ఇక్కడ ఆడటం లేదు. జాతీయ జట్టులో ఆడేందుకు ఎంత సిద్ధంగా ఉన్నానన్నది నా చేతుల్లో లేదు. నన్ను ఎంపిక చేయాలా? వద్దా? అనేది సెలెక్టర్ల నిర్ణయం' అని భువీ స్పష్టం చేశాడు.ఆగస్టు 14 నుంచి ప్రారంభం కానున్న యూపీ టీ20 లీగ్ నాలుగో సీజన్‌లో భువనేశ్వర్ కుమార్ లఖ్‌నవూ ఫాల్కన్స్‌కు నాయకత్వం వహించనున్నాడు. 24 రోజుల పాటు జరిగే ఈ టోర్నీలో మొత్తం 34 మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. తొలిసారిగా రెండు నగరాల్లో పోటీలు జరగనున్నాయి. లఖ్‌నవూలోని ఏకానా క్రికెట్ స్టేడియంలో లీగ్ మ్యాచ్‌లు.. అనంతరం కాన్పూర్‌లోని గ్రీన్‌పార్క్ స్టేడియంలో మిగిలిన మ్యాచ్‌లు జరగనున్నాయి.

శ్రీలంక ఎలెవన్‌తో వార్మప్ మ్యాచ్.. టీమిండియా ఘన విజయం

శ్రీలంక ఎలెవన్‌తో కొలంబో వేదికగా జరిగిన మూడు రోజుల వార్మప్ టెస్టు మ్యాచ్‌లో భారత జట్టు 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మూడో రోజు 207 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా.. 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. యశస్వి జైస్వాల్(61×) హాఫ్ సెంచరీ చేసి రిటైర్డ్ హర్ట్ అయ్యాడు. గాయం బారిన పడిన కెప్టెన్ శుభ్‌మన్ గిల్(44) నేడు బ్యాట్ పట్టాడు. స్టార్ బౌలర్ సిరాజ్(32×) కీలక ఇన్నింగ్స్ ఆడి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఆఖరిలో హ్యాట్రిక్ సిక్సర్లు బాది ఆశ్చర్యపరిచాడు. శ్రీలంక ఎలెవన్ బౌలర్లలో కేషారా 2 విశ్వా ఫెర్నాండో, రమేశ్ మెండీస్ తలొక వికెట్ పడగొట్టారు.తొలి ఇన్నింగ్స్‌లో శ్రీలంక ఎలెవన్ 363/8 వద్ద డిక్లేర్ చేసిన సంగతి తెలిసిందే. తొలి రోజు వికెట్లు తీయడానికి ఇబ్బంది పడిన భారత బౌలర్లు.. రెండో రోజు రాణించారు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 357/6 వద్ద డిక్లేర్ ఇచ్చింది. దేవదత్ పడిక్కల్(142×) సూపర్ సెంచరీ చేశాడు. రవీంద్ర జడేజా(63×) రాణించాడు. రెండో ఇన్నింగ్స్‌లో శ్రీలంక ఎలెవన్ 200/6 వద్ద డిక్లేర్ ప్రకటించింది. తొలి ఇన్నింగ్స్‌తో కలిపి 207 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా.. అద్భుతంగా ఛేదించింది.



మామిళ్లగూడెం నుంచి ఐసీఐసీఐ బ్యాంక్ డిప్యూటీ మేనేజర్‌గా అర్వపల్లి అఖిల నాగ రమ్య

చిన్ననాటి నుంచే క్రమశిక్షణతో చదువుతూ.. ఉన్నత స్థాయికి ఎదిగిన యువతి
పిల్లలు పుట్టినప్పుడు కాదు వారు భవిష్యత్తులో అభివృద్ధిలోకి వచ్చినప్పుడే నిజమైన ఆనందం అని నిరూపించిన అర్వపల్లి నగేష్-శ్రీలక్ష్మి



ఖమ్మం, ఆగస్టు : మామిళ్లగూడెం లో నివాసం ఉండే మధ్యతరగతి కుటుంబానికి చెందిన అర్వపల్లి నగేష్- ల కుమార్తె అఖిల నాగరమ్య, చిన్ననాటి నుండే చదువులో ముందుండి,ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా పట్టుదలతో, ఉన్నత చదువులు చదివి నేడు దేశంలోనే ప్రముఖ బ్యాంకుల్లో ఒకటైన ఐసీఐసీఐ బ్యాంకులో డిప్యూటీ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించే స్థాయికి ఎదిగారు. కష్టపడి చదివి, లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఆమె విద్యా ప్రస్థానం నిరూపిస్తోంది.

ఎన్ని కష్టాలు ఎదురైనా తన కుమార్తె భవిష్యత్తు బాగుండాలని, ఆర్థికంగా ఎన్నో సమస్యలు తలెత్తిన, కుమార్తెను వెన్ను తట్టి ప్రోత్సహించడంలో తల్లిదండ్రులు కీలక పాత్ర పోషించారు తద్వారా అఖిల నాగ రమ్య 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మామిళ్లగూడెంలోని మాంటిస్సోరి ప్రైవేట్ స్కూల్‌లో విద్యనభ్యసించారు. అనంతరం ఇంటర్ విద్యను సాహితి జూనియర్ కాలేజీలో పూర్తిచేశారు. ఉన్నత విద్యలో భాగంగా గుంటూరులోని మాస్టర్ మైండ్స్ కాలేజీలో తన చదువును కొనసాగించారు.

విద్యార్థి దశ నుంచే పట్టుదల, క్రమశిక్షణతో చదువుతూ తన లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషి చేసిన అఖిల నాగ రమ్య, తాజాగా ఐసీఐసీఐ బ్యాంకులో డిప్యూటీ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించటం, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్నేహితులు, ఆమెను చదివించిన ఉపాధ్యాయుల్లో ఆనందాన్ని నింపింది.

"విద్యకు కృషి తోడైతే విజయానికి హద్దులు ఉండవు" అన్నట్లుగా అఖిల నాగ రమ్య సాధించిన ఈ విజయాన్ని పలువురు అభినందిస్తున్నారు. ఆమె మరింత ఉన్నత స్థాయికి ఎదిగి, తల్లిదండ్రులకు, చదివిన పాఠశాల--కళాశాలలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నారు.

తల్లిదండ్రుల ఆనందం

కూతురు చిన్ననాటి నుంచి కష్టపడి చదువుకుని ఉన్నత ఉద్యోగాన్ని సాధించడం పట్ల తల్లిదండ్రులు నగేష్, శ్రీలక్ష్మి ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అఖిల నాగ రమ్య భవిష్యత్తులో మరెన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని వారు ఆకాంక్షించారు.

మామిళ్లగూడెం నుంచి ప్రారంభమైన అఖిల నాగ రమ్య విద్యా ప్రయాణం.. ఐసీఐసీఐ బ్యాంక్ డిప్యూటీ మేనేజర్ స్థాయికి చేరుకోవడం నేటి యువతకు స్ఫూర్తిదాయకం.

కేంద్రమంత్రి బండి సంజయ్‌ను కలిసిన బిజెపి జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం



కరీంనగర్, ఆగస్టు 10: బిజెపి జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన సాయిని మల్లేశం మొదటిసారిగా కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ని మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు.

నూతనంగా బాధ్యతలు చేపట్టిన సాయిని మల్లేశం ని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ అభినందించారు

జిల్లాలో పార్టీ బలోపేతానికి, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని ఈ సందర్భంగా బండి సంజయ్ సూచించారు . ఈ కార్యక్రమంలో

మేయర్ కొలగాని శ్రీనివాస్

డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు,కార్పొరేటర్లు: ఎన్నం లక్ష్మీ ప్రకాష్, గాజ రమ శివరాం, కర్రె పద్మ అనిల్, సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాసరావు, గుంజేటి శివ, గాధగోని రమేష్ తదితరులు పాల్గొన్నారు


ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అందజేత ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

తెలంగాణ పవర్ న్యూస్ బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ ఎల్బీనగర్ ఆగస్టు: బి.యన్.రెడ్డి.నగర్ డివిజన్ పరిధిలోని ఎస్.కె.డి.నందు నివాసం ఉంటున్న ప్రసాద్ గారు ఊపిరితిత్తులకు సంబందించిన పలు సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో వారి యొక్క కుటుంబ సభ్యులు ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి గారిని సంప్రదించారు.వెంటనే స్పందించిన సుధీర్ రెడ్డి గారు వారి చికిత్సకు అవసరమైన వివరాలను ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా దరఖాస్తు చేయించారు.దానికి గాను రూ.2,60,000 (రెండు లక్షల అరవై వేల రూపాయలు) ఎల్.ఓ.సీ. మంజూరు కాగా ఆ చెక్కును బాధితుని భార్య ధనలక్ష్మి కి అందజేశారు.

ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి గారు మాట్లాడుతూ పేద ప్రజలకు సేవ చేయడం తమకు ఎంతో సంతృప్తిని ఇస్తుందని తెలిపారు. తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో అనేక మంది పేద కుటుంబాలకు సహాయం చేసే అవకాశం లభించిందన్నారు.

అనంతరం బాధిత భార్య మాట్లాడుతూ మా వారి ఆరోగ్య సమస్య విషయంలో సుధీర్ రెడ్డి గారు ప్రత్యేక చొరవ తీసుకుని సహాయం చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.చికిత్స కోసం చెక్కు అందించడంలో ఆయన చూపిన సహకారం జీవితాంతం మరువలేమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో భారస నాయకులు చెన్నగోని శ్రీధర్ గౌడ్,పండల రాజశేఖర్,మంద రాజశేఖర్ రెడ్డి,నితీష్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



రసవత్తరంగా ఆర్యవైశ్య సంఘం ఎన్నికలు-77 ఓట్లతో అధ్యక్షుడిగా నామ విజయం



జహీరాబాద్ ఆగష్టు 10:: జహీరాబాద్ పట్టణ ఆర్యవైశ్య సంఘం ఎన్నికలు రసవత్తరంగా సాగాయి. మాజీ కౌన్సిలర్, ఆర్యవైశ్య సంఘం మాజీ కార్యదర్శి నామ రవికిరణ్ ఘన విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి, మాజీ మున్సిపల్ చైర్మన్ అల్లాడి నర్సింలుపై 77 ఓట్ల మెజార్టీతో నామ విజయం సాధించారు.మొత్తం 314 ఓట్లకు గాను 303 ఓట్లు పోలయ్యాయి. ఇందులో నామ రవికిరణ్‌కు 189 ఓట్లు, అల్లాడి నర్సింలుకు 112 ఓట్లు లభించాయి. ఫలితాలను ఎన్నికల అధికారి వెంకటేశ్ ప్రకటించారు. నామ రవికిరణ్ ప్యానెల్ నుంచి ప్రధాన కార్యదర్శిగా బడిశెట్టి శ్రీనివాస్ గుప్తా, కోశాధికారిగా బడంపేట్ శ్రీనివాస్ గుప్తా విజయం సాధించారు. విజయం అనంతరం నామ రవికిరణ్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి గెలిపించిన ఆర్యవైశ్య సంఘం కుటుంబ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో పోటీ స్నేహపూర్వకంగా, న్యాయబద్ధంగా జరిగిందని, సంఘం అభివృద్ధి, ఐక్యత, సంక్షేమం కోసం అందరినీ కలుపుకొని ముందుకు సాగుతానని పేర్కొన్నారు.

సామాజిక చైతన్యాన్ని పెంపొందించే కళా ప్రదర్శనలకు అందరూ తరలిరావాలి

జి యం దుర్గం రామచందర్



భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి ఆగస్టు 10 తెలంగాణ పవర్ : మణుగూరు ఏరియాలోని పి.వి. కాలనీ కమ్యూనిటీ హాలులో సామాజిక ఐక్యత, అక్షరాస్యత సామాజిక చైతన్యంపై ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ, హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ప్రత్యేక కళా ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ తెలిపారు.ఈ నెల 17.08.2026 నుండి 19.08.2026 వరకు ప్రతిరోజు సాయంత్రం 6.30 గంటల నుండి రాత్రి 8.00 గంటల వరకు ఈ కళా కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలిపారు. సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం, విద్య, మానవతా విలువలు, సామాజిక చైతన్యాన్ని పెంపొందించే సందేశాలను కళారూపంలో ప్రజలకు అందించనున్నట్లు పేర్కొన్నారు.
మూడు రోజుల ప్రత్యేక నాటక ప్రదర్శనలు ఈ నెల 17ఆగస్టు.2026"సంఘం శరణం గచ్ఛామి" బాబాసాహెబ్ డా. బి.ఆర్. అంబేడ్కర్ జీవితం, సామాజిక న్యాయం, సమానత్వం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషిని ప్రతిబింబించే నాటకం.
18.ఆగస్టు.2026 "సత్యశోధన" మహాత్మా జ్యోతిరావు ఫూలే సామాజిక నంన్కరణలు, విద్యా వ్యాప్తి, సమానత్వం సామాజిక మార్పు కోసం ఆయన చేసిన కృషిని తెలియజేసే నాటకం.19.ఆగస్టు.2026"బుద్ధునితో నా ప్రయాణం" గౌతమ బుద్ధుని మానవతా సందేశం, శాంతి, కరుణ, నమానత్వం, నైతిక విలువలను ప్రతిబింబించే నాటకం.ఈ మూడు రోజుల కళా ప్రదర్శనలు సమాజంలో సామాజిక ఐక్యత, చైతన్యం, సమానత్వం మానవతా విలువలను పెంపొందించేందుకు ఎంతో ఉపయోగపడతాయని జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ పేర్కొన్నారు.కావున మణుగూరు ఏరియాలోని అధికారులు, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, సింగరేణి పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు పట్టణ ప్రజలు తమ కుటుంబ సభ్యులతో కలిసి అధిక నంఖ్యలో హాజరై ఈ కళా ప్రదర్శనలను వీక్షించి, కార్యక్రమాలను విజయవంతం చేయాలని జనరల్ మేనేజర్ సాదరంగా ఆహ్వానించారని ఏరియా అధికార ప్రతినిధి డ ఏజిలఎం(పర్సనల్) ఎస్. రమేశ్ ఒక ప్రకటనలో తెలియజేశారు.

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు,కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో రాస్తారోకో



భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి ఆగస్టు 10 తెలంగాణ పవర్ : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జాతీయ కార్మిక, రైతు సంఘాల పిలుపుమేరకు మణుగూరులో సిపిఐ, ఏఐటియుసి, టి యు సి ఐ ఎం సి పి ఐ ఆధ్వర్యంలో సోమవారం సిపిఐ కార్యాలయం ఎదుట ప్రధాన రహదారిపై జెండాలు చేత పట్టుకొని రాస్తారోకో నిర్వహించారు. దీంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్ స్తంభించింది .అధికారుల జోక్యంతో ఆందోళన విరమించారు.ఈ సందర్భంగా సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గాల సుధాకర్,టి యు సి ఐ జిల్లా అధ్యక్షులు ఆర్ మధుసూదన్ రెడ్డి లు మాట్లాడుతూ..కేంద్రంలో మూడోసారి ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ,వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడానికి వాణిజ్య ఒప్పందాలను చేస్తుందని, దేశానికి వెన్నుముక రైతు అని చెప్పినటువంటి కేంద్రం, నేడు రైతుకి గిట్టుబాటు ధర లేకుండా, సబ్సిడీ రుణాలు ఇవ్వకుండా, విత్తనాలు అధిక రేట్లు పెంచుతూ, యూరియా రేట్లు రెట్టింపు చేస్తూ, ఆరు కాలం పంట పండించే రైతుకు గిట్టుగిట్టుబాటు ధర కల్పించకుండా మధ్య దళారీలు దోపిడీ చేస్తుంటే ప్రభుత్వం ఏం చేస్తుందని వారు ప్రశ్నించారు. జాతీయ ఉపాధి హామీ పథకం 100 రోజులు నుండి 200 రోజులకు పెంచాలని, రోజువారీ కూలీ 700 ఇవ్వాలని ఒకవైపు ఆందోళన చేస్తుంటే ఉన్న పథకాన్ని రద్దుచేసి రాంజీ పథకం పేరుతో ప్రభుత్వం కుట్ర చేస్తుందని దీనిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.విద్యుత్ సవరణ 2025 చట్టం రద్దు చేయాలని, పంటకి గిట్టుబాటు ధర కల్పించాలని చట్టం చేయాలని, రుణమాఫీ, పంటల బీమా అమలు చేయాలని, నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలను తక్షణమే రద్దు చేయాలని లేకపోతే పెద్ద ఎత్తున దేశవ్యాప్త
ఆందోళనకు పూనుకుంటామని వారు హెచ్చరించారు.ఈ ధర్నా కార్యక్రమంలో సిపిఐమండల కార్యదర్శి జక్కుల రాజబాబు,జిల్లా సమితి సభ్యులు ఎడారి రమేష్,రాంగోపాల్,సొందే కుటుంబరావు, రైతు సంఘం మండల అధ్యక్షులు దండుగుల బాబు, ఏఐటీయూసీ సహాయ కార్యదర్శి గద్దం వెంకటేశ్వర్లు, సిపిఐ మండల సహాయ కార్యదర్శి వేర్పుల నరేష్, పట్టణ నహాయ కార్యదర్శి తోట రమేష్,కొడిమెల నుజాత,కోశాధికారి కొత్తవల్లి సీతారాములు,కన్నెబోయిన ప్రసాద్, రుద్ర నాగరాజు, బొగ్గు కార్యదర్శి యాకూబ్ ,కణతాల కోటయ్య ,లింగస్వామి, భీమరాజు కృష్ణ, బత్తుల లక్ష్మయ్య, లక్ష్మి, రంజిత్,ఆంజనేయులు,టి యు సి ఐ నాయకులు సంజీవరెడ్డి,యాకయ,రాజేందర్,బత్తుల వెంకటేశ్వర్లు, సుధాకర్,తిరుపతి,ఎం సిపిఐ నాయకులు మోహనరావులు పాల్గొన్నారు.

సెక్టార్ కమిటీల నిర్మాణాలను వేగవంతం చేయాలి

అక్టోబర్ 9న హైదరాబాద్ లో జరిగే బహిరంగ సభను విజయవంతం చేద్దాం - బీఎస్పీ



నాగర్‌కర్నూల్ (తెలంగాణ పవర్) ఆగస్టు : 10: బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ) నాగర్‌కర్నూల్ జిల్లా స్థాయి సమీక్ష సమావేశం సోమవారం ఉదయం 10 గంటలకు నాగర్‌కర్నూల్‌లోని బాబు జగ్జీవన్ రామ్ భవన్‌లో జిల్లా అధ్యక్షులు బోనాసి రాంచందర్ అడ్వకేట్ అధ్యక్షతన నిర్వహించారు.

ఇ సమావేశానికి బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పృథ్వీరాజ్, పార్లమెంట్ ఇన్‌చార్జ్ సి.కళ్యాణ్ లు హాజరై పార్టీ సంస్థాగత నిర్మాణం, భవిష్యత్ కార్యాచరణపై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి నాయకుడు తన గ్రామంలో వెంటనే సెక్టార్ కమిటీలను మరియు బూత్ కమిటీలను పూర్తి చేయాలని సూచించారు.

ూడుకుర్తి గ్రామ నూతన సెక్టార్ అధ్యక్షులుగా దేవరపాగ రాముడు, ప్రధాన కార్యదర్శిగా నాగపూరి రాజశేఖర్ గారిని నియమించారు.

గ్రామస్థాయి నుంచే పార్టీ నిర్మాణాన్ని పటిష్ఠం చేస్తేనే బీఎస్పీని ప్రజల్లో మరింత బలంగా నిలబెట్టవచ్చని పేర్కొన్నారు.

అదేవిధంగా అక్టోబర్ 9న హైదరాబాద్‌లో నిర్వహించనున్న బహుజన్ సమాజ్ పార్టీ భారీ బహిరంగ సభను చారిత్రాత్మక సభగా నిలుపుదామని పిలుపునిచ్చారు.

ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి, ప్రతి గ్రామం నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు పాల్గొనేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు.

ఈ సమావేశంలో కొల్లాపూర్ అసెంబ్లీ ఇంచార్జ్ మునిస్వామి, నాగర్ కర్నూల్ అసెంబ్లీ ఇంచార్జ్ ఆంజనేయులు, నాగర్ కర్నూల్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి బోనాసి భాస్కర్, కార్యదర్శి కాకునూర్ మధు, కోశాధికారి నాగరాజ్, నాయకులు జై భీం శంకర్, హర్ష ముదిరాజ్, జన్ను ఆంజనేయులు, దేవరపాగ రాముడు, వాడాల మొగులాల్, వంగూరి అశోక్, నాగపూరి రాజశేఖర్, బివిఫ్ నాయకులు వెంకటేష్, రమేష్ మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

మెట్‌పల్లిలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం




మెట్‌పల్లి, ఆగస్టు 10 (తెలంగాణ పవర్): జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో, జోగ జనార్ధన్ జ్ఞాపకార్థం రేకుర్తి, కరీంనగర్‌కు చెందిన వైద్యుల బృందం చేత సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. లయన్స్ క్లబ్ సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరాన్ని ముఖ్య అతిథిగా హాజరైన మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి ప్రారంభించారు.
అనంతరం మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి జన్మదిన వేడుకలను లయన్స్ క్లబ్ సభ్యులు, ప్రజల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. లయన్స్ క్లబ్ సభ్యులు, పలువురు ప్రముఖులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.
ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి మాట్లాడుతూ, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాసరావు మంచి మాటకారి మాత్రమే కాకుండా సేవా గుణం కలిగిన వ్యక్తి అని కొనియాడారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు.
లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య పరీక్షలు, కంటి ఆపరేషన్లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కంటి వైద్య పరీక్షలు, ఆపరేషన్ల కోసం వచ్చే వారు ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలతో పాటు ఒక ప్లేట్, ఒక గ్లాసు, ఒక బెడ్‌షీట్ వెంట తీసుకురావాలని సూచించారు.
అలాగే రక్త పరీక్ష, మూత్ర పరీక్షలకు కలిపి రూ. 220 మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. నిర్ణయించిన మొత్తం కంటే ఒక్క రూపాయి కూడా అదనంగా ఎవరైనా వసూలు చేస్తే తన దృష్టికి తీసుకురావాలని శ్రీనివాసరావు సూచించారు.
లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు దొంతుల ఆంజనేయులు మాట్లాడుతూ, వైద్య శిబిరానికి వచ్చే ప్రజలు నిర్వాహకులు సూచించిన నిబంధనలు, తీసుకురావాల్సిన వస్తువుల విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. శిబిరంలో అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.
మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ మాట్లాడుతూ, ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హోటల్ ఫుడ్‌కు దూరంగా ఉండి, ఇంట్లో తయారు చేసుకున్న ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలని ప్రజలకు సూచించారు.
డబ్బు కంటే ఆరోగ్యమే ముఖ్యమని, ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని కూన గోవర్ధన్ అన్నారు. ప్రజలకు సేవ చేస్తున్న లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాసరావుకు ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.
ఈ ఉచిత కంటి వైద్య శిబిరంలో లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బొమ్మల శివ, క్యాషియర్ జోగ జగదీశ్వర్, లయన్స్ క్లబ్ సభ్యులు జోగ నరేష్, ఆల్ రౌండర్ గంగాధర్, కౌన్సిలర్లు నల్లోండ నరేష్, కాజా అజీమ్, అజయ్, లయన్స్ క్లబ్ సభ్యులు సభ్యులు, రేకుర్తి కరీంనగర్ వైద్యుల బృందం, బొమ్మల శంకర్, ఇల్లెందుల శ్రీనివాస్, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సినిమా

వారణాసి కథలో భారీ బలముందు



అందుకే ఐమ్యాక్స్ ఫార్మాట్ ఎంచున్నా..దర్శకధీరుడు జక్కన్న వెల్లడి.స్టార్ హీరో మహేశ్‌బాబు కథానాయకుడిగా ఎస్.ఎస్.రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ అడ్వెంచర్ ఫిల్మ్ 'వారణాసి'లో ప్రియాంక చోప్రా కథానాయిక. పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. టైమ్ ట్రావెల్ కథాంశం, భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ మూవీకి సంబంధించిన కీలక అప్‌డేట్‌ను జక్కన్న పంచుకున్నారు. ఇటీవల ఓ ఇంటర్నేషనల్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో 'వారణాసి' ప్రస్తుత పరిస్థితితో పాటు, ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఇప్పటికే 'వారణాసి' 80 శాతం షూటింగ్ పూర్తయింది. ఇంకా 20శాతం ఉంది. ఈ సినిమాకు సంబంధించి కీలక సన్నివేశాలు, యాక్షన్ సీక్వెన్స్ పూర్తి చేశాం. మిగిలినవి చిన్న చిన్న సన్నివేశాలే. 2022 నుంచి 'వారణాసి' కథను డెవలప్ చేయడం మొదలు పెట్టాం. అంటే దాదాపు నాలుగున్నరేళ్లు పట్టిందని వివరించారు. వారణాసి' గురించి అన్నీ ఇప్పుడే చెప్పలేం. 'ఇండియానా జోన్స్' అంటే నాకు చాలా ఇష్టం. ఆ కథ, హీరో చేసే సాహసాలు చిన్న పిల్లలకు నచ్చుతాయి. నాకూ సరదాగా అనిపిస్తాయి. కథ, దాని నేపథ్యం తెలియకుండా ప్రేక్షకులు సినిమాను ఆస్వాదించలేరని నా అభిప్రాయం. అందుకే 'వారణాసి'కి సంబంధించి వీడియో ప్రత్యేకంగా ఉండేలా గ్లింప్స్‌ను విడుదల చేశాం. దీన్ని మీరు పరిశీలిస్తే, కథ వారణాసిలో మొదలై అంటార్కిటికా, ఆఫ్రికాల్లో ప్రయాణించి రామాయణ కాలానికి తీసుకెళ్తుంది. మళ్లీ వారణాసికి తీసుకొస్తుందన్నారు. ఇక ఈ కథలో ఉన్న భారీదనమే ఐమ్యాక్స్ ఫార్మాట్‌లో తీయడానికి కారణం. అంటార్కిటికాలో 300 అడుగులకు పైగా ఉన్న భారీ మంచు కొండ, రామాయణంలోని భారీ వానర సేన ఇలా ఎన్నో కీలక సన్నివేశాలు ఇందులో ఉన్నాయి. అవన్నీ అద్భుతంగా, విశాలంగా చూపించాలంటే ఐమ్యాక్స్ సరైనదనిపించింది. దీని వల్ల సినిమాకు అదనపు హంగు జోడించినట్లైందన్నారు. ఐమ్యాక్స్ కెమెరాలను పూర్తిగా వాడిన దర్శకుడు క్రిస్టఫర్ నోలన్. ఆయనంటే నాకు చాలా ఇష్టం. నోలన్‌ను నేనెప్పుడూ కలవలేదు. హాలీవుడ్ సినిమాలంటే నాకు ఆసక్తి. చిన్నప్పటి నుంచి వాటిని చూస్తూ పెరిగాను. ఆ ప్రభావం నా సినిమాలపై ఉంటుంది. నా సినిమాలను హాలీవుడ్ చిత్రాలతో పోలుస్తుంటారు. అందుకు నేనెప్పుడూ ఇబ్బంది పడనని అన్నారు. గత చిత్రానికి భిన్నంగా జక్కన్న 'వారణాసి'ని పరుగులు పెట్టిస్తున్నట్లు తాజా అప్‌డేట్ చూస్తే అర్థమవుతోంది. ఒకవైపు షూటింగ్ చేస్తూనే మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా వేగంగా చేస్తున్నారు. పలు అంతర్జాతీయ వీఎఫ్ఎక్స్ కంపెనీలు ఈ సినిమా కోసం పనిచేస్తున్నాయి. దుర్గా ఆర్ట్స్ పతాకంపై కేఎల్. నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.



ఇరుముడి నుంచి యాలాలో.. యాలాలో పాట విడుదల

మాస్ మహారాజా రవితేజ హీరోగా, కుటుంబ కథా చిత్రాల దర్శకుడు శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'ఇరుముడి' పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్న ఈ ఎమోషనల్ ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. సినిమా విడుదలకు సమయం దగ్గరపడుతుండటంతో ప్రమోషన్లను మేకర్స్ వేగవంతం చేశారు. ఈ నేపథ్యంలో చిత్రం నుంచి రెండో సింగిల్ 'యాలాలో యాలాలో.. వెన్నెల్లో ఎన్నెన్ని ముచ్చట్లో..' అనే మధురమైన ఫ్యామిలీ మెలోడీని విడుదల చేశారు. కుటుంబ బంధాలు, ఆప్యాయత, భావోద్వేగాలను ప్రతిబింబించేలా రూపొందిన ఈ పాట తొలి వినికిడిలోనే ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఈ పాటకు ప్రముఖ గేయ రచయిత అనంత శ్రీరామ్ హృదయాన్ని హత్తుకునే సాహిత్యం అందించగా, సంగీత దర్శకుడు జి.వి. ప్రకాష్ కుమార్ తన మెలోడీ స్వరాలతో పాటను మరింత అందంగా తీర్చిదిద్దారు. విడుదల చేసిన పోస్టర్‌లో రవితేజ తన కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా కనిపించడం సినిమా భావోద్వేగ నేపథ్యాన్ని ప్రతిబింబిస్తోంది. ఇప్పటికే విడుదలైన తొలి పాట 'ఇరుముడి కట్టు' భక్తి గీతంగా మంచి ఆదరణ పొందింది. యూట్యూబ్‌లో ట్రెండింగ్‌లో నిలిచిన ఆ పాట తర్వాత ఇప్పుడు 'యాలాలో యాలాలో'తో సినిమా మరోసారి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. 'ఇరుముడి'లో రవితేజ ఇప్పటివరకు చేయని ఓ విభిన్నమైన పాత్రలో కనిపించనున్నారని చిత్రబృందం చెబుతోంది. తండ్రి?కూతుళ్ల అనుబంధాన్ని ప్రధానాంశంగా తీసుకున్న ఈ కథలో అయ్యప్ప స్వామి దీక్షకు కూడా కీలక ప్రాధాన్యం ఉంది. తన కూతురి కోసం జీవితాన్ని మార్చుకునే ఓ తండ్రి ప్రయాణాన్ని భావోద్వేగభరితంగా చూపించనున్నట్లు తెలుస్తోంది. సోషల్ మీడియాలో సినిమా విడుదల తేదీపై వస్తున్న ఊహాగానాలకు కూడా మేకర్స్ తెరదించారు. ముందుగా ప్రకటించినట్లుగానే ఆగస్టు 21న 'ఇరుముడి' ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుందని అధికారికంగా స్పష్టం చేశారు. కుటుంబ అనుబంధాలు, ఆధ్యాత్మికత, మాస్ యాక్షన్ అంశాల సమ్మేళనంగా రూపొందుతున్న 'ఇరుముడి' రవితేజ కెరీర్‌లో మరో ప్రత్యేక చిత్రంగా నిలుస్తుందనే నమ్మకంతో అభిమానులు ఎదురుచూస్తున్నారు.



శూర్పణఖ పాత్ర సంక్లిష్టమైనది: రకుల్

మునుపెన్నడూ చేయని శూర్పణఖ అనే కొత్త పాత్రతో 'రామాయణ' సినిమాలో అలరించడానికి రకుల్ ప్రీత్ సింగ్ సన్నద్ధమవుతోంది. ఈ నేపథ్యంలోనే ఓ అభిమాని 'మీరీ పాత్రను అంగీకరించడానికి కారణమేంటని అడగ్గా.. దీనికి సామాజిక మాధ్యమాల వేదికగా బదులిస్తూ.. ఓ పోస్ట్ పెట్టింది రకుల్. శూర్పణఖ పాత్రను ఒప్పుకోవడానికి కారణం ఆమెలోని సంక్లిష్టత. చరిత్ర తరచుగా ఆమెను కేవలం ఒకే ఒక్క ఘట్టం ద్వారా మాత్రమే గుర్తుంచుకుంటుంది. కానీ ఆమె కథ వెనుక అంతకు మించి ఎన్నో విషయాలు దాగి ఉన్నాయి. ఒక నటిగా ప్రేక్షకుల్లో ఇప్పటికే ఉన్న పాత ఆలోచలను, అభిప్రాయాలను మార్చేలా ఉండే వైవిధ్యమైన పాత్రలు చేయడం నాకు ఎంతో ఉత్సాహాన్ని ఇస్తుంది. అందుకే ఈ ఛాలెంజింగ్ పాత్రకు ఒకే చెప్పా. 'రామాయణ' థియేటర్లలోకి వచ్చినప్పుడు ప్రేక్షకులు ఈ శూర్పణఖ పాత్రను ఒక కొత్త కోణంలో, విశాలమైన మనసుతో అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నానని ఆ పోస్ట్‌లో పేర్కొంది.



సూర్య 'విశ్వనాథ్ ఉ సన్స్' మూవీ ట్రైలర్ విడుదల

తమిళ స్టార్ హీరో సూర్య కథానాయకుడిగా నటించిన 'విశ్వనాథ్ ఉ సన్స్' చిత్రం ట్రైలర్ విడుదలైంది. తొలి ఫ్రేమ్ నుంచే ఆసక్తికరంగా సాగిన, భావోద్వేగభరితమైన, హృదయాన్ని తాకే కుటుంబ కథా చిత్రంగా ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని ట్రైలర్ స్పష్టమైన సంకేతాలు ఇచ్చింది. దర్శకుడు వెంకీ అట్లూరి తనదైన భావోద్వేగ కథనంతో రూపొందించిన ఈ చిత్రాన్ని సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. ఈ ఏడాది అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్లలో ఒకటిగా ఈ చిత్రం నిలవనుంది.

ట్రైలర్‌లో సంజయ్ విశ్వనాథ్ అనే అంతర్జాతీయ పిస్టల్ షూటర్ పాత్రను పరిచయం చేశారు. నలభై ఏళ్ల వయస్సు దాటినా తన కలలను వదలకుండా ముందుకు సాగే వ్యక్తిగా సూర్య కనిపించారు. స్టైల్, హాస్యం, ప్రేమ, భావోద్వేగాలను అద్భుతంగా మేళవిస్తూ ఆయన మరోసారి తన సహజ నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. వెంకీ అట్లూరి హృదయానికి హత్తుకునే రచనతో కలిసి సూర్య కెరీర్‌లో గుర్తుండిపోయే పాత్రల్లో ఇది ఒకటిగా నిలుస్తుందనే నమ్మకాన్ని ట్రైలర్ కలిగిస్తోంది. కథానాయిక మమితా బైజు తన సహజమైన అభినయంతో ఆకట్టుకోగా, రాధికా శరత్‌కుమార్, రవీనా టాండన్తో పాటు ఇతర ప్రముఖ నటీనటులు ఈ కుటుంబ కథకు మరింత బలం చేకూర్చారు. జి.వి. ప్రకాష్ కుమార్ అందించిన హృద్యమైన సంగీతం, నిమిష్ రవి అందించిన అద్భుతమైన ఛాయాగ్రహణం, వెంకీ అట్లూరి తనదైన శైలిలో చెప్పిన భావోద్వేగ కథనం ట్రైలర్‌ను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాయి.

ఇటీవల కోయంబత్తూరులో ఘనంగా నిర్వహించిన ఆడియో విడుదల వేడుకలో చిత్రబృందం ఈ సినిమా భావోద్వేగాల పరంగా ప్రతి వయసు ప్రేక్షకుడిని అలరిస్తుందని ఎంతో నమ్మకంగా చెప్పింది. తాజాగా విడుదలైన ట్రైలర్ ఆ నమ్మకాన్ని పూర్తిగా నిజం చేస్తూ, థియేటర్లలో ఓ అద్భుతమైన అనుభూతిని అందించబోతుందనే అంచనాలను మరింత పెంచింది.

సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంస్థలు సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రాన్ని శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తోంది. ఆగస్టు 14, 2026న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రానున్న 'విశ్వనాథ్ ఉ సన్స్', ఈ స్వాతంత్ర్య దినోత్సవ వారాంతంలో ప్రేక్షకులకు మరపురాని భావోద్వేగ ప్రయాణాన్ని అందించేందుకు సిద్ధమవుతోంది.



మంచి సినిమా నిర్మించాలన్నదే లక్ష్యం

బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్, టాలెంటెడ్ డైరెక్టర్ వంశీ పైడిపల్లి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న తాజా సినిమాకు సంబంధించి వస్తున్న వార్తలపై మేకర్స్ క్లారిటీ ఇచ్చారు. ఈ చిత్రంలో నటించేందుకు సల్మాన్ ఖాన్ తన పారితోషికాన్ని భారీగా తగ్గించుకున్నారంటూ గత కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. అయితే ఆ వార్తలను సినిమా నిర్మాతలు తాజాగా ఖండించారు. ఆ ప్రచారమంతా పూర్తిగా నిరాధారమైనదని స్పష్టం చేశారు. ఇలాంటి ఊహాగానాలపై స్పందించడం కంటే, ప్రేక్షకులకు ఒక అద్భుతమైన సినిమా అనుభూతిని అందించడమే తమ ప్రధాన లక్ష్యమని మేకర్స్ పేర్కొన్నారు. ఎస్‌విసి 63'గా పిలవబడుతున్న ఈ సినిమా ప్రస్తుతం అత్యంత కీలకమైన ముంబై యాక్షన్ షెడ్యూల్‌కు సిద్ధమవుతోంది. 2027 ఈద్ కానుకగా ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు జరుగుతుండగా, ఇందులో భాగంగా ఆగస్టు 6 నుంచి ముంబైలో భారీ యాక్షన్ షెడ్యూల్ ప్రారంభం కానుంది. దాదాపు ఆరు వారాల పాటు సాగనున్న ఈ షెడ్యూల్‌లో మూడు భారీ యాక్షన్ సీక్వెన్స్‌లతో పాటు వందలాది మంది జూనియర్ ఆర్టిస్టులతో కూడిన పెద్ద ఎత్తున క్రౌడ్ సీన్స్ చిత్రీకరించనున్నారు. సెప్టెంబర్ అంతటా ఈ షూటింగ్ కొనసాగనుండగా, అక్టోబర్ నాటికి యాక్షన్ పార్ట్ మొత్తాన్ని పూర్తి చేయాలని చిత్ర యూనిట్ టార్గెట్ పెట్టుకుంది. సల్మాన్ ఖాన్ స్టంట్స్‌తో పాటు జనాల మూవ్‌మెంట్ కూడా చాలా కీలకంగా ఉండే ఈ షెడ్యూల్‌లో ప్రముఖ నటి నయనతార కూడా యూనిట్‌తో చేరనున్నట్లు తెలుస్తోంది. సాధారణంగా 120 కోట్లకు పైగా రెమ్యునరేషన్ తీసుకునే సల్మాన్ ఖాన్, ఈ సినిమా కోసం దానిని సుమారు 70 కోట్లకు తగ్గించుకున్నారని, నిర్మాత రఫీ కాజీతో ఉన్న స్నేహం కారణంగానే ఈ ఫీజు తగ్గింపు జరిగిందని గతంలో వార్తలు వచ్చాయి. అయితే వీటిపై ఎలాంటి అధికారిక ప్రకటన లేనప్పటికీ, ఇప్పుడు మేకర్స్ ఆ వార్తలను పూర్తిగా కొట్టిపారేశారు.





Edited, Printed, Published and Owned by NASREEN KHAN , Printed at M/s DATTASAI GRAPHICS :1-1-651/8, Gandhi Nagar, Hyderabad-500 080
Published from H.No.1-7-137, Flat 402, Vijaysai Apartments, Zamistanpur, Musheerabad, Hyderabad- 20, (Telangana) Editor:Nasreen Khan, Ph : 040-27602786, Cell : 965243981 .R.N.I.No.TELTEL/2013/51844